బుధవారం
06-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 254
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

నేపాల్‌లో కొత్త ప్రభుత్వం...

ఖాట్మండు: నేపాల్ సంకీర్ణ ప్రభుత్వంలో మార్పులు జరిగాయి. పాలక పక్షం నుంచి నేపాలీ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పేసీ నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూనిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్)తో ప్రధాని పుష్ప కమల్ దహల్ (ప్రచండ) జత కట్టారు. నేపాలీ కాంగ్రెస్ పార్టీతో తెగతెంపులు చేసుకు న్నారు. కేబినెట్ మంత్రులు అందరినీ తొలగించి, ముగ్గురు కొత్తవారికి పదవులు కట్టబెట్టారు. కొత్త మంత్రుల్లో ఒకరు నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యూఎంఎల్)కు చెందిన వారు కాగా మిగతావారు నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్ట్ సెంటర్), రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ సభ్యులు. నేపాలీ కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఎవరూ స్వతహాగా రాజీనామా చేయకుండా తమ పార్టీతో తెగతెంపులు చేసుకున్న కారణంగా కేబినెట్ పదవి నుంచి దహల్ తొలగించేంత వరకు ఆగారు.

నిత్యం పస్తులే...

- పసిబిడ్డల ఆకలి కేకలు
- ఆఫ్రికా దేశాల తర్వాతి స్థానంలో భారత్
- 'టెలిగ్రాఫ్' అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత్ వృద్ధి సాధిస్తోందని, పేదరికం తగ్గిందన్న ప్రచారం పెద్దఎత్తున సాగుతోంది. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రగాల్భాలు మరింత ఎక్కువయ్యాయి. కానీ ఆకలి సూచీలో భారత్ స్థానం క్రమంగా క్షీణిస్తోంది. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆకలి కేకలు మిన్నంటున్నాయి. ఆరు నెలల నుంచి 23 నెలల వయస్సుగల పసిపిల్లల్లో 5.9 మిలియన్లు అంటే 59లక్షల మంది 24 గంటల పాటు పస్తులు ఉంటే పరిస్థితి దేశంలో ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ జాతీయ కుటుంబ నమూనా సర్వే (2019-21) డేటా ఆధారంగా జరిగిన 'టెలిగ్రాఫ్' అధ్యయనం తేల్చింది. క్షుద్బాధలో ఆఫ్రికా దేశాలైన గునియా, బెనిన్, లిబియా, మాలి తర్వాత స్థానంలో భారత్ ఉందని పేర్కొంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఖ్య ఎక్కువని, ఆ రాష్ట్రంలో 'జీరో ఫుడ్' పిల్లలు 24.7శాతంగా ఉన్నట్లు తెలిపింది. అలాగే చత్తీస్‌గఢ్‌లో 24.6శాతంగా, జార్ఖండ్‌లో 21శాతంగా, రాజస్థాన్‌లో 19.8శాతంగా, అసోంలో 19.4 శాతంగా ఆకలితో అలమటించే పిల్లల సంఖ్య ఉన్నట్లు వెల్లడించింది. అయితే 2016 నుంచి 'జీరో ఫుడ్' శాతాల్లో పెద్దగా తేడా లేదని, ఆ ఏడాది 17.2శాతం మంది పిల్లలు ఈ విభాగం కింద వస్తే 2021 నాటికి 17.8శాతానికి పెరిగారని తెలిపింది. 20 రాష్ట్రాల పరిస్థితులతో పోల్చితే ఒక్క బెంగాల్‌లో ఈ సంఖ్య తగ్గిందని, 2016లో 12.1శాతం నుంచి 2021లో 7.5శాతానికి క్షీణించిందని పేర్కొంది. అలాగే గోవాలో 18.9శాతం నుంచి 5.1శాతానికి తగ్గినట్లు పేర్కొంది.

దేశంలో రోజంతా ఏమీ తినని పిల్లల సంఖ్య 19.3శాతంగా భారత్‌లో నమోదు కాగా బంగ్లాదేశ్‌లో 5.6శాతంగా, పాకిస్థాన్‌లో 9.2శాతంగా, డీఆర్ కాంగోలో 7.4శాతంగా, నైజీరియాలో 8.8శాతంగా, ఇథియోపియాలో 14.8శాతంగా ఉందని అధ్యయనం వెల్లడించింది. భారత్‌లో ఆకలితో అలమటించే చిన్నారుల సంఖ్య పశ్చిమ ఆఫ్రికా దేశాలతో సమానమని తేలిపింది. 24 గంటలు పస్తు ఉండే (జీరో ఫుడ్) పిల్లల సంఖ్య భారత్‌లో ఎక్కువని హార్వర్డ్ యూనివర్సిటీ జనాభా ఆరోగ్య పరిశోధకుడు ఎస్వీ సుబ్రమణ్యం, ఆయన సహచరుల అధ్యయనం తేల్చింది. ఈ నివేదిక 'జమా నెట్‌వర్క్ ఓపెన్' ప్రచురించింది. దీని ప్రకారం 'జీరో ఫుడ్' పిల్లలు భారత్‌లో 19 శాతంగా ఉంటే గినియా (21.8 శాతం), మాలి (20.5 శాతం) తర్వాత స్థానంలో మన దేశం ఉందని వెల్లడైంది. 2010-21 మధ్య వివిధ సమయాల్లో 92 తక్కువ-మధ్య ఆదాయ దేశాలలో ఆరోగ్య సర్వేల ఆధారంగా ఈ అధ్యయనం జరిగింది. 'జీరో ఫుడ్' కిందకు వచ్చే 99శాతం మంది పిల్లలు కేవలం తల్లి పాలపై ఆధారపడతారు. ఆరు నెలల తర్వాత తల్లి పాలు మాత్రమే వారికి సరిపోవు.దీంతో వారి మనుగడ ప్రశ్నార్థమవుతుంది. దక్షిణాసియాలో అత్యధిక సంఖ్యలో 'జీరో ఫుడ్' పిల్లలు ఎనిమిది మిలియన్లు (80లక్షల మంది) ఉన్నట్లు అధ్యయనం చెబుతోంది. వీరిలో సుమారు 6.7 మిలియన్ల (67లక్షల) మంది భారత్‌లో ఉన్నట్లు పేర్కొంది. భారత్‌లో ప్రతి 10 మంది చిన్నారుల్లో కనీసం ఇద్దరికి రోజు మొత్తం భోజనం లభించని దుస్థితి ఉందని వెల్లడైంది. 2016 నుంచి ఈ పరిస్థితుల్లో మార్పు లేదని అధ్యయనం పేర్కొంది. ఆరు

- మిగతా 2 లో

ఇక 'మూడు'తో సిద్ధం!

- రాజధానుల పేరుతో రాజకీయ లబ్ధికి వ్యూహం
- విశాఖలో సీఎం జగన్ వ్యాఖ్యలపై విపక్షాల ఆగ్రహం
- ప్రజల మధ్య చిచ్చు రేపే కుట్ర అంటూ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్నికల ప్రచారంలో భాగంగా 'సిద్ధం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బహిరంగసభలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తాజాగా మూడు రాజధానుల అస్త్రాన్ని బయటకు తీశారు. ఈ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉండడంతో కొంత కాలంగా సీఎం క్యాంపు కార్యాలయం విశాఖ కు మారుస్తున్నట్లు ప్రచారంతో సరిపెట్టారు. కోర్టు తీర్పుల నేపథ్యంలో విశాఖ వెళ్లడానికి వెనుకంజ వేసిన జగన్... వచ్చే ఎన్నికలకు దీనిని ప్రధాన అస్త్రంగా ప్రయోగించడానికి సిద్ధపడ్డారు. దీనిలో భాగంగానే మంగళవారం విశాఖపట్నంలో జరిగిన విజన్ విశాఖ సదస్సులో ముఖ్యమంత్రి మళ్లీ మూడు రాజధానుల అస్త్రాన్ని సంధించారు. ఎన్నికల తర్వాత విశాఖపట్నంలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తానని ప్రకటించారు. అమరావతికి తాను వ్యతిరేకం కాదని అంటూనే, దానిపై మళ్లీ బురద చల్లే ప్రయత్నం చేశారు. 'అమరావతిలో రాజధాని ప్రకటనకు ముందే ఒక వర్గానికి చెందిన వారు వేలాది ఎకరాలు భూమిని కొనుగోలు చేశారు. దీంతో విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ అనగానే ఈ భూముల కొన్నవారంతా అక్కడ వారి భూముల రేట్లు పడిపోతాయని ఒక్కసారిగా భీతిల్లిపోయారు. అందుకే ముఖ్యమంత్రి అనే వ్యక్తి ఇక్కడకు వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెంది... ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా పురోగతి సాధిస్తుందని భయపడ్డారు. అందుకే కోర్టులకెక్కి కేసులు మీద కేసులు వేస్తూ, ఇక్కడకు నేను రాకుండా అడ్డుకుంటున్నారు. వారి స్వప్రయోజనాల కారణంగా వైజాగ్ సందిగ్ధంలోకి వెళ్లాల్సి వచ్చింది' అంటూ సీఎం ఉత్తరాంధ్ర ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేశారు. నాకేమైనా స్వప్రయోజనం ఉంటే నేను కడప గురించి మాట్లాడేవాడినని.. రాష్ట్రం అనేది ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరిదీ అనేది తన అభిప్రాయమని చెప్పుకొచ్చారు. 'భవిష్యత్తు తరాలకు ఏది చేస్తే మంచిది...మన పిల్లలకు ఏం చేస్తే బాగుంటుంది...ఏం చేయడం వల్ల రాష్ట్ర ఆదాయాలు పెరుగుతాయి... దేని వల్ల ఆర్థికంగా

- మిగతా 2 లో

మళ్లీ గెలిస్తే...విశాఖలోనే ప్రమాణ స్వీకారం

- ఎన్నికల తర్వాత ఇక్కడే ఉంటా
- 'విజన్ వైజాగ్' సదస్సులో సీఎం జగన్
- మూడు రాజధానులే తమ విధానమని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దసరాకు మీ బిడ్డ విశాఖలో కాపురం పెడతాడు... సెప్టెంబర్‌లో విశాఖకు మకాం మారుస్తా... నవంబర్ లో విశాఖకు షిఫ్ట్ అవుతా... ఈ విధంగా అనేక సార్లు మూడు రాజధానులు పేరిట చెబుతూ రాష్ట్ర ప్రజల్ని

- మిగతా 2 లో

బీసీలకు 50ఏళ్లకే పెన్షన్

- నెలకు రూ.4వేలు పెళ్లి కానుక రూ.లక్ష
- చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్
- స్వయం ఉపాధికి రూ.10వేల కోట్లు
- రూ.5వేల కోట్లతో ఆదరణ పరికరాలు
- శాశ్వత కుల ధృవీకరణ పత్రాల జారీ
- 'బీసీ డిక్లరేషన్' ప్రకటించిన చంద్రబాబు, పవన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బీసీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని టీడీపీ-జనసేన ప్రకటించాయి. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'జయహో బీసీ' సభలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు బీసీ డిక్లరేషన్ విడుదల చేశారు. బీసీల అభివృద్ధికి చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ మంజూరు చేస్తామని ప్రకటించారు. అలాగే ప్రస్తుతం ఇచ్చే పింఛను రూ.3వేలను రూ.4వేలకు, పెళ్లి కానుక రూ.లక్షకు పెంపు చేస్తామని ప్రకటించారు. విద్యాపథకాలన్నీ పునరుద్ధరిస్తామని, షరతులు లేకుండా విదేశీ విద్య అమలు చేస్తామన్నారు. చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్ కోసం తీర్మానం చేస్తామని, అన్ని సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 34శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్ల ఏర్పాటు

- మిగతా 2 లో

సాయిబాబా నిర్దోషి

- పదేళ్లకు జరిగిన న్యాయం
- మాజీ ప్రొఫెసర్‌కు బాంబే హైకోర్టులో ఊరట
- మళ్లీ సుప్రీంకెళ్లిన మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబై: దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, దివ్యాంగుడు జీఎన్ సాయిబాబాకు బాంబే హైకోర్టు ఊరట కల్పించింది. ఆయనను నిర్దోషిగా ఉన్నత న్యాయస్థానం ప్రకటించింది. యావజ్జీవ శిక్షను రద్దు చేస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. సాయిబాబాపై ఆరోపణలను ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని జస్టిస్ వినయ్ జోషి, జస్టిస్ వాల్మికి ఎస్.ఏ మెనేజెస్‌తో కూడిన ద్విసభ్య డివిజన్ బెంచి పేర్కొంది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద మావోయిస్టులతో సంబంధాలు ఉన్న ఆరోపణలపై కేసులో సాయిబాబా (55)కు ఊరట కల్పించింది. రూ.50వేల పూచీకత్తుపై ఈ కేసులో నిందితుల విడుదలకు ఆదేశాలిచ్చింది. 2017 మార్చిలో గడ్చిరోలిలోని సెషన్స్ కోర్టు సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని

- మిగతా 2 లో

ఎన్నికల బాండ్ల వివరాలను

ఎస్‌బీఐ వెంటనే ఇవ్వాలి

- జూన్ వరకు గడువు కావాలనడం తగదు
- సుప్రీం ఆదేశాల అమలుకు ఆర్బీఐ, కేంద్రం చర్యలు తీసుకోవాలి
- సీపీఐ కార్యదర్శి నారాయణ డిమాండ్

చెన్నై: ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ వెంటనే ఇవ్వాలని, దీనిపై గడువు కోరడం కాలయాపన ఉద్దేశానికి నిదర్శనమని సీపీఐ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేసే విధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు ఆదేశాలివ్వాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)తో పాటు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అజ్ఞాత దాతల ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించాలన్న ఆదేశాలతో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవించాలని ఎస్‌బీఐకు స్పష్టం చేయడం ఆర్బీఐ బాధ్యతని నారాయణ గుర్తుచేశారు. ఈనెల 6వ తేదీలోగా సంబంధిత డేటా అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశిస్తే... జూన్ 30 వరకు గడువు ఇవ్వాలని ఎస్‌బీఐ కోరడాన్ని తప్పుపట్టారు. ఇదంతా తప్పించుకునే ప్రయత్నాలని దుయ్యబట్టారు. లావాదేవీలన్నీ డిజిటల్‌గా జరగడంతో డేటా తీయడానికి రోజులు కాదు కొన్ని నిమిషాలు చాలని అన్నారు. జూన్ 30 నాటికి ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేస్తామనడం... ఐదేళ్లుగా నాన్చుతున్న అంశాన్ని మరింతగా జాప్యం చేయడమే అవుతుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల బాండ్ల రూపేణ అధికార బీజేపీకి మొత్తం నిధి నుంచి 55శాతం సమకూరదాన్ని నారాయణ గుర్తుచేశారు. ఆర్బీఐ గవర్నర్... గుజరాత్‌కు చెందిన వారని, మోదీకి విధేయుడని అందరికీ తెలుసన్నారు. ఆర్బీఐ చీఫ్ సమ్మతం లేకుండా ఎస్బీఐ చీఫ్ సుప్రీంకోర్టు తలుపు తట్టగలరా అని నారాయణ ప్రశ్నించారు. సర్వోన్నత న్యాయస్థానం చారిత్రక తీర్పులు వెలువరిస్తోంది కానీ వాటిని నీరుగార్చే ప్రయత్నాల్లో రాజ్యాంగబద్ధ సంస్థలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని, డేటా సమర్పణకు గడువు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకొనేలా ఎస్‌బీఐకు ఆదేశాలివ్వాలని ప్రధాని మోదీని నారాయణ డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రధాని మౌనం వెనుక కుట్రకోణం ఉందన్న సందేహం ప్రజలకు కలుగుతుందని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు కృషి చేయాలని ప్రధానికి నారాయణ హితవు పలికారు.

ఇదీ లోకం!

డీకే శివకుమార్‌కు ఊరట

మనీ లాండరింగ్ కేసు కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మనీ ల్యాండరింగ్ కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2018 మనీ ల్యాండరింగ్ కేసును సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం

- మిగతా 2 లో

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- 140 కోట్ల మంది భారతీయులు నా కుటుంబమే: మోదీ
- మహంకాళి అమ్మను దర్శించిన ప్రధాని

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రపంచంలో భారతదేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, ఈ రోజు నేను మీ అందరికి గ్యారంటీ ఇస్తున్నాననీ, రాసుకోండంటూ ప్రధాని మోదీ అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం ఉదయం ముందుగా సికింద్రాబాద్ లోని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పటాన్‌చెరు బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ దేశాల్లో తెలుగు ప్రజలు కీలకభూమిక పోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీపై ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో మీ ఆశీర్వాదాలు వృథా కానివ్వను... ఇది మోదీ గ్యారంటీ అంటూ వ్యాఖ్యానించారు. మీ అందరికీ తెలుసు మోదీ ఏదైతే చెబుతాడో అదే చేసి చూపుతాడని, అలాగే మోదీ గ్యారంటీ అంటే ఇచ్చిన హామీని నెరవేర్చే గ్యారంటీ అంటూ పేర్కొన్నారు. నేడు భారత్‌ను ప్రపంచంలో సరికొత్త శిఖరాలకు చేర్చాలనే లక్ష్యంతో మేము ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే భారత్ ప్రపంచానికి ఆశాకిరణంలా

- మిగతా 2 లో

నేడు దిల్లీ చలో 2.0

- హక్కుల సాధించే వరకు వెనక్కి తగ్గం: ఎస్‌కేఎం, కేఎంఎం
- ట్రాక్టర్లు లేకుండా రావాలని రైతులకు పిలుపు
- పంజాబ్-హర్యానా సరిహద్దుల వద్ద ఆగని ఆందోళనలు
- సరిహద్దులతో పాటు రైల్వే స్టేషన్లు-బస్టాండ్లలో అదనపు బలగాల మోహరింపు

2లో

ఫ్రాన్స్‌లో మహిళలకు 'అబార్షన్' హక్కు

చారిత్రక బిల్లుకు పార్లమెంటు ఆమోదం

దేశవ్యాప్తంగా సంబరాలు

పారిస్: ఫ్రాన్స్ మహిళలకు అబార్షన్ హక్కు లభించబోతోంది. ఈ మేరకు చారిత్రక బిల్లును ఆ దేశ పార్లమెంటు ఆమోదించింది. ఇలా చేసిన తొలి దేశంగా ఫ్రాన్స్ చరిత్రకెక్కింది. తాజా పరిణామంతో దేశవ్యాప్తంగా మహిళలు సంబరాలు చేసుకున్నారు. నా శరీరం, నా ఇష్టమన్న నినాదాలు, ప్లకార్డులతో వీధుల్లో కదం తొక్కారు. గర్భవిచ్ఛిత్తి (అబార్షన్)ను రాజ్యాంగ హక్కుగా ఫ్రాన్స్ పార్లమెంటు గుర్తించింది. ఉభయ సభల (జాతీయ అసెంబ్లీ, సెనెట్) సంయుక్త సమావేశంలో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. దీంతో హక్కుల సంఘాల దశాబ్దాల పోరాటం ఫలించింది. అబార్షన్ బిల్లుకు 780 అనుకూల, 72 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. మీ శరీరం మీదే.. ఎవరూ మిమ్మల్ని శాసించలేరు' అని మహిళలకు సందేశమిచ్చామని బిల్లుకు ఆమోదం క్రమంలో ప్రధాని గేబ్రియేల్ అట్టల్ అన్నారు. 1974 నుంచి ఫ్రాన్స్ మహిళలు ఈ హక్కు కోసం పోరాడుతున్నారు. 2022లో అమెరికా సుప్రీంకోర్టు కూడా మహిళలకు అబార్షన్ హక్కు ఉండాలని తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.

యూరప్ ఎన్నికల్లో పోటీ చేస్తాం

స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటన

స్టాక్‌హోమ్: యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయాలని స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌కేపీ) నిర్ణయించింది. ఈ ఎన్నికలు జూన్‌లో జరగనున్నాయి. పార్టీని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయంగా నిలిచే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సంస్థాగత పార్టీలకు కాకుండా కార్మిక వర్గానికి విప్లవాత్మక ప్రత్యామ్నాయం అందించాలని పోటీలో నిలవబోతున్నట్లు వెల్లడించింది. 'ఎన్నికల రోజు ఇంటికి పరిమితం కావడం కంటే కమ్యూనిస్టులకు ఓటు వేయడం ద్వారా మీ బలాన్ని నిరూపించుకోవచ్చు' అని ఎస్‌కేపీ చైర్మన్ ఆండ్రియాస్ సోరెన్‌సన్ అన్నారు. ఆండ్రియాస్ పోటీ చేయడం లేదు కానీ యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ ఆఫ్ స్వీడెన్ (ఎస్‌కేయూ) అధ్యక్షుడు మార్టిన్ టైరీ, స్వీడెన్, డెన్మార్క్‌లో కమ్యూనిస్టు ఉద్యమాల అనుభవంగల ప్రీస్కూల్ టీచర్ విన్నీ లిక్కె, ఎస్‌కేపీ అంతర్జాతీయ కార్యదర్శి, ట్రక్కు డ్రైవర్ కారల్ గున్నార్సన్ పోటీ చేయబోతున్నారు. త్వరలోనే ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించబోతున్నట్లు పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది.

విశాలాంధ్ర ప్రపంచం

ఐదు శాతం ఆర్థిక వృద్ధిలక్ష్యం

చైనా వార్షిక సమావేశాలలో ప్రధాని లీ

బీజింగ్: ఐదు శాతం మేర ఆర్థిక వృద్ధిని 2024 సంవత్సరానికిగాను చైనా లక్ష్యంగా పెట్టుకుంది. ఈమేరకు జిన్‌పింగ్ ప్రభుత్వం తమ కార్యాచరణ నివేదికను మంగళవారం బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో ప్రారంభమైన 14వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (ఎన్‌పీసీ), నేషనల్ లెజిస్లేచర్ రెండవ సెషన్‌లో ప్రవేశపెట్టింది. పట్టణాల్లో 12 మిలియన్ల ఉద్యోగాలు సృష్టించాలని భావిస్తోంది. ఈ ఏడాది పట్టణ నిరుద్యోగ రేటును 5.5శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అలాగే 3.9 ట్రిలియన్ యువాన్‌లు విలువ చేసే ప్రత్యేక బాండ్లు స్థానిక ప్రభుత్వాల కోసం జారీ అవుతాయని పేర్కొంది. వార్షిక సమావేశాల్లో దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు అగ్రనాయకు లు పాల్గొన్నారు. ప్రభుత్వ నివేదికను ప్రధాని లీ కియాంగ్ ప్రవేశపెట్టారు. నిర్దేశిత లక్ష్యాలు, అమలు చేసిన, చేయబోయే విధానాలను వివరించారు. స్టేట్ కౌన్సిల్ ఆర్గానిగ్ లా డ్రాఫ్ట్‌ను ఎన్‌పీసీ స్థాయి సంఘం వైస్ చైర్మన్ లీ హోంగ్‌జోంగ్ సభ ముందరుంచారు. ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై 2023లో అమలు చేసిన...2024లో అమలు చేయబోయే ముసాయిదా ప్రణాళికలతో పాటు ప్రస్తుత-గత సంవత్సరాల కేంద్ర, స్థానిక బడ్జెట్‌లపైనా సభ్యులు సమీక్షించారు.

సాధారణ వస్త్రాల్లోనూ వద్దు

భారత్ సైన్యం ఉపసంహరణపై ముయిజ్జు

మాల్దీవులతో చైనా రక్షణ ఒప్పందం

మాలే: మీ సైన్యం మా దేశంలో ఉండేందుకు వీల్లేదు... మామూలు దుస్తుల్లోనూ ఉండరాదని భారత్‌కు మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు మరోమారు తేల్చిచెప్పారు. భారత్ తన సైన్యాన్ని తక్షణమే ఉపసంహరించాలన్నారు. ఇందుకు ఈనెల 10వ తేదీ వరకు డెడ్‌లైన్‌ను ఆయన గతంలోనే విధించారు. అయితే మాల్దీవుల్లో ఉన్న సైన్యం స్థానంలో టెక్నికల్ సిబ్బందిని భర్తీ చేస్తామని భారత్ ఇంతకుముందు చెప్పింది. దాని ప్రకారం సిబ్బందిని పంపింది. ఇదే క్రమంలో మా భూభాగంలో మీ సైన్యం ఏ రూపంలోనూ ఉండేందుకు వీల్లేదని భారత్‌కు ముయిజ్జు మళ్లీ స్పష్టంచేశారు. చైనాతో మాల్దీవులు సైనిక ఒప్పందం చేసుకున్న తర్వాత ఈ వ్యాఖ్యలు చేయడం భారత్‌తో వివాదాన్ని మరింత పెంచినట్లు అయ్యింది. మాల్దీవులు-చైనా మధ్య సైనిక సహకారంపై కీలక ఒప్పందం జరిగిన కొన్ని గంటల్లోనే ముయిజ్జు ఈ వ్యాఖ్యలు చేశారు. మాల్దీవులకు ఉచితంగా సైనిక పరికరాలను చైనా అందించబోతోంది. మాల్దీవుల్లోని మూడు వైమానిక స్థావరాల్లో భారత సైన్యం విధులు నిర్వర్తిస్తోంది. ఫిబ్రవరి 2న దిల్లీ వేదికగా మాల్దీవులు-భారత్ మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. మాల్దీ వుల్లో ఉన్న భారత బలగాల స్థానంలో సమర్థులైన టెక్నికల్ సిబ్బందిని నియమిం చేందుకు భారత్ నిబంధన పెట్టింది. ఈ నిబంధనను అంగీకరించిన మాల్దీవులు ఇప్పుడు మాట మార్చింది. గతవారమే మాల్దీవులకు సిబ్బంది చేరుకోగా సివిల్ డ్రెస్‌లలో ఉండే సిబ్బంది కూడా ఉండకూడదని ముయిజ్జు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

నిత్యం పస్తులే...

(మొదటిపేజీ తరువాయి)

నెలల నుంచి 23 నెలల మధ్య వయస్కులపై సర్వే జరిగింది. ఈ వయస్సు పిల్లలు రోజు మొత్తం ఏమీ తినకుండా ఉండటమన్నది ఊహించలేనిదని అధ్యయనకర్తలు తెలిపారు. 6,00,000 ఇళ్లను అధ్యయనం చేసినట్లు వెల్లడించారు.

2016-2021 మధ్య కాలంలో జరిగిన సర్వేల ప్రకారం గణాంకాల్లో పెద్దగా మార్పు లేదన్నారు. ఆరు నెలల నుంచి 23 నెలల పిల్లలు తీసుకునే ఆహారంపై ప్రశ్నలకు 'లేదు' (నో) అనే సమాధానం రావడం ద్వారా రోజంతా ఏమీ తినలేదని తేలిందని అధ్యయనంలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

సాయిబాబా నిర్దోషి

(మొదటిపేజీ తరువాయి)

దేశద్రోహులుగా పేర్కొంది. ఇదే క్రమంలో యావజ్జీవ శిక్ష విధించింది. సాయిబాబా ప్రస్తుతం నాగపూర్ సెంట్రల్ జైల్లో ఉన్నారు. డివిజన్ బెంచ్ ఈయన కేసును మరోమారు విచారించింది. 2022 అక్టోబరులోనూ హైకోర్టు ధర్మాసనం సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించగా మహారాష్ట్ర ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లింది. బాంబే హైకోర్టు తీర్పును పక్కనపెట్టిన సర్వోన్నత న్యాయస్థానం మళ్లీ విచారించాలని సూచించింది. దీంతో బాంబే హైకోర్టు పునర్విచారణ చేపట్టి సాయిబాబాను నిర్దోషిగా తేల్చింది. ప్రాసిక్యూషన్ సందేహాలు వ్యక్తం చేయడం తప్ప ఆరోపణలను రుజువు చేయలేకపోయినట్లు వెల్లడించింది. నిందితులను నిర్దోషులుగా పేర్కొంటూ వారిపై ఉపా కేసులను రద్దుచేసింది. సాయిబాబాతో పాటు మహేశ్ టిర్కీ, హేమ్ మిశ్రా, పాండు నరోటే, విజయ్ టిర్కీ, ప్రశాంత్ రాహి ఉన్నారు. సెషన్స్ కోర్టు తీర్పును బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. ఏ తప్పు చేయలేదని, తమపై ఆరోపణలు అవాస్తవమని, హింసను ప్రేరేపించేందుకు గడ్చిరోలి జిల్లా వాసులను రెచ్చగొట్టలేదని, నక్సల్ సాహిత్యాన్ని ప్రచారం చేయలేదని కోర్టుకు వివరణ ఇచ్చుకున్నారు. ఉపాలోని సెక్షన్ 45(1) కింద ఆరోపణల ఆధారంగా సెషన్స్ కోర్టు ఆదేశాలను బాంబు హైకోర్టులో సవాల్ చేశారు. గతంలో హైకోర్టు జడ్జి రోహిత్ బి.డియో నేతృత్వ ధర్మాసనం ఆయనతో పాటు ఐదుగురిని నిర్దోషులుగా పేర్కొంది. ఉగ్రవాదం దేశ భద్రతకు ముప్పు... దాని అంతానికి అమ్ములపొదిలోని ప్రతి ఒక్క న్యాయబద్ధ అస్త్రాన్ని వినియోగించడం అవసరం, అయితే నిందితులకు చట్టం కల్పించే రక్షణను ప్రజాస్వామ్యం కాదనలేదు' అని హైకోర్టు నాడు తీర్పునిచ్చింది.

నా భర్త ఇంటి వస్తేనే నాకు మనశ్శాంతి: వసంత కుమారి

సాయిబాబాను బాంబే హైకోర్టు నిర్దోషిగా తీర్పునివ్వడంపై ఆయన భార్య వసంత కుమారి హర్షం వ్యక్తంచేశారు. పదేళ్ల న్యాయ పోరాటం తర్వాత న్యాయం జరిగిందని అన్నారు. సాయిబాబా తరపు వాదించిన న్యాయవాదులు, ఆయనకు మద్దతిచ్చిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఆయన ఇంటికి వచ్చేంత వరకు తనకు మనశ్శాంతి ఉండదని, ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయం వెంటాడుతుందని చెప్పారు. 2022లోనూ తన భర్తను నిర్దోషిగా కోర్టు తీర్పునిస్తే దానిని పై కోర్టులో సవాల్ చేశారని గుర్తుచేశారు. తన భర్తను ప్రజలు నమ్మారు కాబట్టి ఆయన ప్రతిష్ఠ ఎప్పుడూ దిగజారలేదని చెప్పారు. 'తాజా తీర్పుతో పెద్ద బరువు దిగినట్లు అయ్యింది. ప్రస్తుతం ఏం ఆశించాలో మాకు అర్థం కావడం లేదు. ఆయన ఇంటికి వస్తే తప్ప మనశ్శాంతి కలగదు' అని ఆమె అన్నారు. ఈ పదేళ్ల కాలం చాలా కష్టంగా గడిచిందని, సాయిబాబాతో పాటు తన మొత్తం కుటుంబం ఆర్థికంగానే, మానసికంగా కుంగుబాటుకు గురైందని వసంత కుమారి చెప్పారు. కోవిడ్ కాలంలో సాయిబాబా రెండుసార్లు వైరస్ బారిన పడ్డారని, తోటి ఖైదీ మృత్యువాత పడటం, మెడికల్ ఎమర్జెన్సీలోనూ బెయిల్ రాకపోవడంతో నిస్సహాయంగా ఉండిపోయినట్లు తెలిపారు. ఆయన ఆరోగ్యంపై తీవ్ర ఆందోళనకు గురైనట్లు తెలిపారు. చాలా కాలం నిరీక్షించిన తర్వాత నిర్దోషిగా తీర్పు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు.

సుప్రీంకు మహారాష్ట్ర ప్రభుత్వం

సాయిబాబాను నిర్దోషిగా తేల్చుతూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో మహారాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. ఈ మేకు ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది. నేరాన్ని రుజువు చేసేందుకు సహేతుకమైన సాక్ష్యాధారాలు లేనందున ముద్దాయిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు ఇస్తున్నట్లు బాంబు హైకోర్టు పేర్కొన్నది.

భారత్ దేశం కాదు...ఉపఖండం

డీఎంకే నేత వివాదాస్పద వ్యాఖ్యలు

కాంగ్రెస్, బీజేపీ ఖండన

చెన్నై: భిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన భారత్ ఎప్పుడూ ఒక దేశం కాదని.. ఉపఖండమంటూ డీఎంకే ఎంపీ ఏ రాజా చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. డీఎంకే ఇటీవల ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో రాజా చేసిన ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. రాముడి గురించీ ఆయన తప్పుగా మాట్లాడారని... వెంటనే అరెస్టు చేయాలని డిమాండు చేసింది. దీనిపై స్పందించిన కాంగ్రెస్... రాజా వ్యాఖ్యలతో ఏకీభవించడం లేదని, వాటిని ఖండిస్తున్నామని ప్రకటించింది. 'భారత్ ఒక దేశం కాదు. ఎప్పుడూ ఒక దేశంగా లేదు. ఒకే భాష, ఒకే సంప్రదాయం, ఒకే సంస్కృతి.. వంటి లక్షణాలు ఉంటే ఒకే దేశం అంటారు. కానీ, భారత్ అలా కాదు. భిన్న భాషలు, విభిన్న సంస్కృతులున్న రాష్ట్రాలు కలిసి దేశంగా ఏర్పడ్డాయి. అందుకే ఇది దేశం కాదు.. ఉపఖండం. ఇక్కడ భిన్నత్వంలో ఏకత్వం ఉంటుంది' అని ఏ రాజా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబడుతూ... డీఎంకే నుంచి ఇటువంటి విద్వేష ప్రసంగాలు వస్తూనే ఉన్నాయని మండిపడింది. సనాతన ధర్మంపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యల వివాదం ముగియకముందే మరో నేత అదేతరహాలో మాట్లాడటం శోచనీయమని పేర్కొంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ మాట్లాడుతూ... డీఎంకే నేత చేసిన వ్యాఖ్యలతో వందశాతం ఏకీభవించడం లేదని, పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఎవరైనా ఏదైనా మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాలని సూచించారు.

మళ్లీ గెలిస్తే...విశాఖలోనే ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

గందరగోళానికి గురిచేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి... మరి కొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా ... మళ్లీ గెలిస్తే విశాఖలోనే సీఎం గా ప్రమాణ స్వీకారం చేస్తానంటూ మరోసారి మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చారు. విశాఖ నగర అభివృద్ధికి పదేళ్ల ప్రణాళిక ఉందని అన్నారు. చెన్నై, హైదరాబాద్ కు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. 'విజన్ వైజాగ్' పేరిట మంగళవారం బీచ్ రోడ్డులోని రాడిసన్ బ్లూ హోటల్లో పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో సీఎం జగన్ మాట్లాడుతూ... ఎన్నికల తర్వాత తాను విశాఖలోనే ఉంటానని, ఈసారి సీఎంగా ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. నగర అభివృద్ధికి ఆచరణాత్మక ప్రణాళిక అవసరం అన్నారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే చేయలేదని... కేంద్రం సహకారం ఉండాలన్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య నమూనా కావాలని... సమష్టిగా కృషి చేస్తేనే విశాఖ నగరం రూపురేఖలు మారుతుందన్నారు. అమరావతికి తాను వ్యతిరేకం కాదన్నారు. శాసన రాజధానిగా అది కొనసాగుతుందన్నారు. అక్కడ 50వేల ఎకరాల బీడు భూమి తప్ప ఏమీ లేదన్నారు. అమరావతిని అభివృద్ధి చేయాలంటే ఎకరానికి రూ.2 కోట్లు అవుతుందని వ్యాఖ్యానించారు. తాను విశాఖ వచ్చేందుకు అనేకసార్లు ప్రయత్నించినా రానివ్వలేదని తెలిపారు. కోర్టు కేసులు, కొన్ని మీడియా సంస్థలు విష ప్రచారం చేశాయన్నారు. భూ కబ్జాలు, అరాచకాలు అని ప్రచారం చేశారని మండిపడ్డారు. సీఎం వైజాగ్‌లో ఉంటే విశాఖ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. తాను ఒక్కడినే విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా చేయాలనుకున్నానని, ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకించాయని తెలిపారు. అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.లక్ష కోట్లు అవుతుందని టీడీపీ ప్రభుత్వమే చెప్పిందని జగన్ అన్నారు.

అమరావతిలో ఎకరానికి మౌలిక సదుపాయాల కల్పనకు ఎకరాకు రూ.2 కోట్లు అవుతుందని డీపీఆర్ ఇచ్చారని సీఎం చెప్పారు. విశాఖలో రోడ్లు ఉన్నాయని, మంచి హోటల్స్ ఉన్నాయన్నారు. సెక్రటేరియట్ విశాఖలో అయితే ఐకానిక్ టవర్స్ కట్టవచ్చని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో నాలుగు పోర్టులను అత్యంత వేగంగా నిర్మిస్తున్నామని సీఎం పారిశ్రామికవేత్తలకు తెలియజేశారు. తాను విశాఖ వచ్చేందుకు ఎంతో ప్రయత్నం చేశానంటూ విశాఖ వాసులను జగన్ నమ్మించే యత్నాలు చేశారు. నాలుగుసార్లు ముహూర్తం పెట్టీ మరీ సీఎం వాయిదా వేసుకున్నారు. సీఎం వస్తే అందరూ వైజాగ్ వస్తారని, అప్పుడు దానంతట అదే అభివృద్ధి చెందుతుందంటూ సీఎం జగన్ చెప్పడం విశేషం.

ఇక 'మూడు'తో సిద్ధం!

(మొదటిపేజీ తరువాయి)

పురోగమిస్తామనే కోణంలో మనం ఆలోచన చేయాలి... ఈ కోణంలో మనం వైజాగ్‌ను ఆలోచించలేకపోతే ఇంకెవరు ఆలోచిస్తారు? అన్నది మనం అంతా ప్రశ్నించుకోవాలి. నాయకుడి దార్శినికత తప్పు అయితే...వైజాగ్ వృద్ధిచెందదు, విస్తరించదు. అందువల్ల హైదరాబాద్, చెన్నై, బెంగుళూరులతో పోటీపడాలంటే వైజాగ్ అనేది ఎకనామిక్ ఇంజిన్‌గా ఆర్థిక చోదకశక్తి కావాల్సిందే. ఎన్నికల తర్వాత సీఎంగా ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తాను. ఇక్కడే నివాసం ఉంటాను. వైజాగ్ పట్ల నాకున్న కృతనిశ్చయం ఇదే' అంటూ జగన్ స్పష్టం చేశారు. మరోపక్క అమరావతి శాసన, కర్నూలును న్యాయ రాజధానులుగా అభివృద్ధి చేసుకుందామంటూ కోస్తా, సీమ ప్రాంత ప్రజలకు సీఎం నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అమరావతి అభివృద్ధికి కనీసం లక్ష కోట్లు అవసరం అవుతాయని... అదే వైజాగ్‌లో అయితే మౌలిక వసతులు అన్నీ ఉన్నాయంటూ గతంలో చెప్పిన విషయాలనే మరోసారి వల్లె వేశారు. మొత్తానికి ఈ ఎన్నికల్లో మూడు రాజధానుల అంశాన్ని బ్రహ్మాస్త్రంగా ప్రయోగించనున్నట్లు జగన్ చెప్పకనే చెప్పారు. అమరావతి ఒక వర్గానికి చెందినదంటూ ఇప్పటివరకు దుష్ప్రచారం చేసిన జగన్... రాబోయే రోజుల్లోనూ అదే పంథాను కొనసాగిస్తూ ఉత్తరాంధ్ర ప్రజలను ఆకర్షించేందుకు ఆరాటపడుతున్నారు. న్యాయ రాజధాని పేరుతో రాయలసీమ ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారు. మొత్తానికి మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల ప్రజల మధ్య భావోద్వేగాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందే కార్యక్రమానికి జగన్ శ్రీకారం చుట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓట్ల కోసం ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్న జగన్: అచ్చెన్నాయుడు ఆగ్రహం

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ సమస్యను పక్కదారి పట్టించేందుకు విశాఖను రాజధానిగా ప్రకటించి ప్రజలను మభ్యపెట్టే కుట్రకు సీఎం జగన్ తెరలేపారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల అనంతరం విశాఖ నుంచి పాలన సాగిస్తా... ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తానని జగన్ రెడ్డి పగటి కలలు కంటున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయకుండా విశాఖలో భూములు కొట్టేసేందుకే రాజధాని నాటకానికి తెరలేపిన జగన్ రెడ్డి, ఐదేళుగా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాడని ఆయన ధ్వజమెత్తారు. ఓట్ల కోసం ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భూములు కబ్జా చేసేందుకు, ఉక్కు కర్మాగారాన్ని అమ్మేందుకు సిద్ధపడిన మాట వాస్తవం కాదా జగన్ రెడ్డీ అని ప్రశ్నించారు. ప్రఖ్యాత కంపెనీలైన లూలూ, ఐబీఎం వంటి కంపెనీలను విశాఖ నుంచి తరిమేసి యువతకు ఉపాధి అవకాశాలను దూరం చేసింది జగనే అన్నారు.

పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను నిర్వీర్యం చేసి, కేంద్ర పర్యావరణ శాఖ వద్దని చెప్పినా వినకుండా రుషికొండను ఆక్రమించి కొండకు గుండు కొట్టి ప్యాలెస్‌లు నిర్మించుకున్నారని ఆయన మండిపడ్డారు. వైసీపీ నాయకుల బెదిరింపులకు భయపడి దాదాపు రూ. 17లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరలిపోవడంతో లక్షల మంది నిరుద్యోగులు రోడ్డున పడేశారు. విశాఖలోని రుషికొండ ఐటీ సెజ్‌లో నాడు తెలుగుదేశం ప్రభుత్వం తీసుకువచ్చిన 14 కంపెనీలను జగన్ రెడ్డి తరిమేశారని...ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

డీకే శివకుమార్‌కు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

కింద శివకుమార్‌పై మోపిన అభియోగాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని జస్టిస్ అనురుద్ధ బోస్, జస్టిస్ బేల ఎం. త్రివేదితో కూడిన ధర్మాసనం అభిప్రాయ పడింది. 2017 ఆగస్టులో దిల్లీలో గల శివకుమార్ ఇంట్లో లెక్కల్లో చూపని నగదు భారీగా పట్టుబడింది. ఆయన ఇళ్లపై ఆదాయపు పన్నుశాఖ దాడులు నిర్వహించింది. తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు రంగంలోకి దిగారు. పట్టుబడిన నగదుకు సంబంధించి మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేశారు. ఆ కేసులో విచారణకు హాజరుకావాలని శివకుమార్‌కు సమన్లు జారీచేశారు. విచారణ నుంచి తప్పించాలని కర్ణాటక హైకోర్టును డీకే ఆశ్రయించారు. అక్కడ ఆయనకు చుక్కెదురు అయింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... డీకే శివకుమార్ ఇంట్లో దొరికిన నగదుతో మనీ ల్యాండరింగ్ జరిగినట్టు నిరూపించలేదని స్పష్టం చేసింది. ఈ కేసులో ఈడీ తర్వాత సీబీఐ అధికారులు రంగంలోకి దిగారు. డీకే శివకుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు కర్ణాటక ప్రభుత్వాన్ని సీబీఐ అధికారులు అనుమతి కోరారు. 2019 సెప్టెంబరులో డీకేను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. వారం రోజుల తర్వాత అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దానిని శివకుమార్ కర్ణాటక హైకోర్టులో సవాల్ చేశారు. అక్కడ ఆయనకు చుక్కెదురు కాగా సుప్రీంకోర్టులో ఊరట లభించింది. కేసును సర్వోన్నత న్యాయస్థాన ధర్మాసనం విచారించి, ఆధారాలు లేవని కొట్టివేసింది.

బీసీలకు 50ఏళ్లకే పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

చేసి దామాషా ప్రకారం నిధుల కేటాయిస్తామన్నారు. సామాజిక న్యాయపరిశీలన కమిటీ ఏర్పాటు చేసి, సబ్‌ప్లాన్ నిధులన్నీ కచ్చితంగా బీసీల అభ్యున్నతికి వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తామని, చట్టబద్ధంగా కులగణన నిర్వహించి, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. అలాగే గురుకులాలను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తామని, ఏడాదిలో బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. రూ.5వేల కోట్లతో వివిధ వృత్తులకు గతంలో ఇచ్చినట్లుగానే 'ఆదరణ' పరికరాలిస్తామన్నారు. పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం పునరుద్ధరిస్తామని, తక్కువ జనాభాతో ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ లేదా మండల కేంద్రాల్లో కామన్ వర్క్ షెడ్స్, ఫెసిలిటేషన్ సెంటర్స్ ఏర్పాటు చేస్తామని, బీసీల జీవన ప్రమాణస్థాయి పెంపుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడతామని చెప్పారు. బీసీల దశ.. దిశ మార్చడం కోసమే డిక్లరేషన్ ప్రకటించామని తెలుగదేశం అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలుగా బీసీలకు అండగా ఉన్న పార్టీ టీడీపీ అని గుర్తు చేశారు. బీసీ డిక్లరేషన్ గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. వందల సమావేశాలు పెట్టి, నేతల అభిప్రాయాలు తీసుకుని డిక్లరేషన్ ప్రకటించాం. బీసీల డీఎన్ఏలోనే టీడీపీ ఉంది. జగన్ వచ్చాక స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ తగ్గించారు. దీని వల్ల 16,800 మంది పదవులు కోల్పోయారు. ఎవరికైనా పదవులు దక్కకుంటే నామినేటెడ్ పదవులు ఇస్తాం. చట్టబద్ధంగా బీసీల కులగణన చేపట్టి, వారి ఆర్థిక పరిస్థితిపై అధ్యయనం చేయాల్సిన అవసరముంది. బీసీల జోలికి ఎవరైనా వస్తే జాగ్రత్త అంటూ చంద్రబాబు హెచ్చరించారు.

153 బీసీ కులాలు ఐక్యంగా ఉండాలి: పవన్ కల్యాణ్

జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే 34 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. బీసీలకు ఏటా రూ.15వేల కోట్లు కేటాయిస్తామని జగన్ మోసం చేశారని విమర్శించారు. బీసీ కార్పొరేషన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, ఇసుక రీచ్‌లు ఒక కంపెనీకి కట్టబెట్టారని ధ్వజమెత్తారు. 153 బీసీ కులాల అభివృద్ధికి జనసేన అండగా ఉంటుందని, వారిలో ఐక్యత చాలా అవసరమని పవన్ అన్నారు.

బీసీలంటే బలహీనవర్గాలు కాదు...బలమైన వర్గాలు: లోకేశ్

బీసీలు అంటేనే భరోసా...బాధ్యత... భవిష్యత్తు అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. బీసీలంటే బలహీనవర్గాలు కాదని, బలమైన వర్గాలుగా మార్చింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక బీసీలను మరింత ప్రోత్సహించారని చెప్పారు. ఇప్పుడు వారిలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామన్నారు. టీడీపీ హయాంలో బీసీ సాధికార కమిటీలు ఏర్పాటు చేశాం. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చాం. ఆదరణ పథకానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించాం. వారికోసం కేంద్రంలో ప్రత్యేక శాఖ ఉండాలని టీడీపీనే తీర్మానం చేసిందని గుర్తు చేశారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజకీయ అవకాశాలు లభించాయన్నారు. టీడీపీ వెనుకే బీసీలున్నారనే అక్కసుతోనే జగన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఏ తప్పు చేయకపోయినా తనను 80రోజులు జైల్లో పెట్టి వేధించారని, బీసీలు గెలవాలంటే టీడీపీ-జనసేన కూటమి విజయం ఒక్కటే పరిష్కారమన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ బీసీలు సామాజికంగా, రాజకీయంగా పైకి వచ్చారంటే ఎన్టీఆర్, చంద్రబాబే కారణమన్నారు. ఇంకా ఈ సమావేశంలో ఎంపీ కింజారపు రామ్మోహన్ నాయుడు, కొనకళ్ల నారాయణ, కిమిడి కళా వెంకట్రావు, కొల్లు రవీంద్ర, పితాని సత్యనారాయణ, కూన రవికుమార్, బీదా రవిచంద్రయాదవ్, నిమ్మల కిష్టప్ప, పంచుమర్తి అనూరాధ, జనసేన నేతలు పోతిన వెంకట మహేష్, బోనబోయిన శ్రీనివాస యాదవ్, వంశీకృష్ణ తదితరులు ప్రసంగించారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మంత్రి గుమ్మనూరు జయరాం

మంత్రి పదవికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మంత్రి గుమ్మనూరు జయరాం టీడీపీలో చేరారు. జయహో బీసీ సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆయనకు పసుపు కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. జయరాంతో పాటు ఆయన మద్దతుదారులు కూడా పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ టీడీపీలోకి తిరిగి రావడం చాలా సంతోషం కలిగిస్తోందన్నారు. బీసీల సంక్షేమం కోసం పని చేసే పార్టీ టీడీపీ అని స్పష్టం చేశారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అభిప్రాయపడ్డారు.

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

(మొదటిపేజీ తరువాయి)

మారిందన్నారు. విదేశాల్లో చాలామంది తెలుగువారు ఉన్నారని, ప్రపంచ దేశాల్లో తెలుగు ప్రజలు కీలకభూమిక పోషిస్తున్నారని తెలిపారు. గతంలో మేం ఇచ్చిన మాట ప్రకారం ఆర్టికల్ 370ని రద్దు చేశామని, ప్రపంచం గర్వించే రీతిలో అయోధ్యలో రాముడి ప్రతిష్ఠాపన జరిగిందన్నారు. కాంగ్రెస్ నేతలు నాపై విమర్శలు చేస్తున్నారు కానీ కాంగ్రెస్ పాలనలో వారి కుటుంబాలు బాగుపడ్డాయి తప్ప ప్రజలు బాగుపడలేదని విమర్శించారు. కుటుంబ వాదాన్ని నేను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ వాదం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుందని, కుటుంబవాదులకు దోపిడీ చేసే లైసెన్స్ ఉందా అని నిలదీశారు. కొంతమంది నాకు అసలు కుటుంబమే లేదని విమర్శిస్తున్నారని, కానీ ఆ నాయకులకు తమ కుటుంబమే ముఖ్యమన్నారు. నాకు మాత్రం దేశమే ముఖ్యం, దేశంలో ప్రతి కుటుంబం ముఖ్యమన్నారు. తనను విమర్శిస్తున్న నేతలు దేశంలో అనేకమందిని రాజకీయంగా ఎదగనివ్వలేదని దుయ్యబట్టారు. యువకులకు కాకుండా వృద్ధులకు మాత్రమే వారు అవకాశం ఇస్తూ కుటుంబవాదులు తమ ఖజానా నింపుకుంటారని ఆరోపించారు. కొందరు నాయకులు గిఫ్ట్ లు తీసుకొని ఖజానా నింపుకుంటున్నారని, వారి దొంగసొత్తును బయటకు కక్కిస్తున్నామని తెలిపారు. మరికొందరు తమ నల్లధనం దాచుకోవడానికి విదేశీ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచారని, ఓ వర్గం తమ కుటుంబాలకు విలాసవంతమైన భవనాలు కట్టిస్తే మేం మాత్రం దేశంలో పేదలకు నాలుగు కోట్ల ఇళ్లు కట్టించామన్నారు. అందుకే నాకు కుటుంబం లేదంటూ కొందరు నేతలు విమర్శిస్తున్నారని కానీ దేశంలోని140 కోట్ల మంది భారతీయులు నా కుటుంబమే అనే విషయాన్ని వారు గుర్తిస్తే మంచిదన్నారు. దేశంలోని ప్రతి చెల్లి, ప్రతి తల్లి నా కుటుంబమే అని ఇది ఇండియా కూటమికి ఇది అర్థం కావడంలేదన్నారు. దేశంలో దళితుల అభ్యున్నతి కోసం అనేక చర్యలు చేపట్టామని, దళితుల సమస్యలు అర్థం చేసుకున్నామన్నారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ రెండూ ఒకటే అని నాణేనికి బొమ్మాబొరుసు లాంటివన్నారు. బీఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేలకోట్లు దోచుకున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను కొత్త ఏటీఎంగా మార్చుకుందని, కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం కుంభకోణానికి పాల్పడితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడానికి బదులు ఆ ఫైలును మూసేసిందని ఆరోపించారు. 'మీరు తిన్నారు, మేం కూడా తింటాం' అన్నట్టుగా రెండు పార్టీల తీరు ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రెండింటిదీ ఒకే బాట అని, ఝూట్.. లూట్ ఈ రెండు సిద్ధాంతాల మీద ఈ పార్టీలు నడుస్తున్నాయన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలవడమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పనిచేయాలన్నారు.

నేడు దిల్లీ చలో 2.0

న్యూదిల్లీ: తమ న్యాయమైన హక్కుల సాధన కోసం రైతన్నలు మరోమారు నడుం బిగించారు. ఓ వైపు దిల్లీ-పంజాబ్- హర్యానా సరిహద్దుల్లో ఆందోళనలు కొనసాగిస్తున్న అన్నదాతలు బుధవారం 'దిల్లీ చలో 2.0'కు సిద్ధమయ్యారు. ఈసారి ట్రాక్టర్లకు బదులు రైళ్లు, బస్సుల్లో దిల్లీకి చేరుకోవాలని, జంతర్ మంతర్ వద్ద మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఇదే క్రమంలో దేశ రాజధాని పహారా నీడలో ఉంది. సరిహద్దులతో పాటు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్టాండ్లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను దిల్లీ పోలీసులు చేశారు. దిల్లీ సరిహద్దుల్లో పోలీసులతో పాటు పారా మిలటరీ బలగాలను మోహరించారు. అదనపు సిబ్బందిని రంగంలోకి దించారు. అనుమతి లేకుండా ఎవరినీ అనుమతించేది లేదని పోలీసులు తేల్చిచెప్పారు. ఇదిలావుంటే, దిల్లీ చలో 2.0కు ట్రాక్టర్లు లేకుండా రావాలని సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) పిలుపునిచ్చాయి. ఈనెల 10న రైల్ రోకోను జయప్రదం చేయాలని కోరాయి. పంజాబ్-హర్యానా సరిహద్దులైన ఖనౌరి, శంభు వద్ద ఆందోళనలు కొనసాగుతాయని పేర్కొన్నాయి. ట్రాక్టర్లు కాకుండా ఇతర వాహనాల్లో దిల్లీలోని జంతర్ మంతర్‌కు చేరుకుంటాయని కేఎంఎం కన్వీనర్ శర్వణ్ సింగ్ పంధేర్ వెల్లడించారు. 'ట్రాక్టర్లు, ట్రాలీలు లేకుండా రైతులు రావాలని ప్రభుత్వం తరచూ చెబుతుంది కాబట్టి ఈసారి అలాగే చేస్తాం. రైళ్లు, బస్సుల్లో దిల్లీకి వెళ్లి మార్చ్ చేస్తాం' అని అన్నారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న రైతులు, కార్మికులను కేంద్రప్రభుత్వం శత్రువులుగా చూస్తుండటం దురదృష్టకరమన్నారు. దేశంలో నిరంకుశ పాలన ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిని దేశ ప్రజలు అనుమతించబోరని అన్నారు. ఎంఎస్‌పీ చట్టం, స్వామినాథ్ సిఫార్సుల అమలు, రైతులకు రుణ మాఫీతో పాటు తమ అన్ని డిమాండ్లను సాధించుకునే వరకు పోరాటం ఆగదని పంధేర్ తేల్చిచెప్పారు. దిల్లీ మార్చ్‌కు రైతులు పిలుపునిచ్చిన క్రమంలో శంభు-అంబాలా, ఖనౌరి-జింద్ సరిహద్దులతో పాటు టిక్రీ, సింఘు, గాజీపూర్ సరిహద్దులు పహారా నీడలో ఉన్నాయి. సింఘు, టిక్రీ సరిహద్దులు పాక్షికంగా తెరుచుకున్నాగానీ పోలీసు, పారామిలటరీ సిబ్బంది అక్కడ విధుల్లో ఉన్నారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అదనపు బలగాలను రైల్వే, మెట్రో స్టేషన్లు, బస్టాండ్ల వద్ద మోహరించినట్లు వెల్లడించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అతిక్రమణకు తావు ఉండదన్నారు. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 12 నుంచి 'దిల్లీ చలో' పేరిట రైతుల ఆందోళన కొనసాగుతోంది.

హైదరాబాద్ కంటే మిన్నగా విశాఖ

- రాజధానిగా ఉంటే బహుముఖ అభివృద్ధి సాధ్యం
- పదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు సాధ్యం
- 'విజన్ విశాఖ' సదస్సులో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: రాబోయే పదేళ్లలో విశాఖపట్నాన్ని తూర్పు తీరంలో మెగాసిటీగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటించారు. ఇందు కోసం 'విజన్ విశాఖ' పేరుతో సమగ్ర ప్రణాళికను ఆవిష్కరించారు. వైజాగ్‌ను అత్యంత డిమాండ్ ఉన్న పెటుబడి గమ్యస్థానంగా అభివర్ణిస్తూ... పదేళ్లలో రూ.1,05,000 కోట్ల పెట్టుబడులను తీసుకుచ్చి విశాఖను అభివృద్ధి చేయవచ్చని ప్రతిపాదించారు. 'విజన్ విశాఖ' పేరుతో నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఏపీ డెవలప్‌మెంట్ సదస్సులో సీఎం జగన్ పాల్గొని మాట్లాడారు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు వైజాగ్‌ను ఫిన్–టెక్ క్యాపిటల్‌గా చూస్తున్నారని ఆయన అన్నారు. హైదరాబాద్ కంటే మిన్నగా విశాఖలో అభివృద్ధి చేయవచ్చునన్నారు. ఉత్పత్తి రంగంలో దేశంలోనే ఏపీ మెరుగ్గా ఉందని, అభివృద్ధిలో విశాఖ నగరం దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్రంలో రాయపట్నం, కాకినాడ, మూలపేట, మచిలీపట్నం పోర్టులు ఎంతో కీలకమని అన్నారు. ఐడీపీఎల్, ఎన్ఎండీసీ, ఎన్ఎఫ్‌సీ, ఐఐసీటీ సహా హైదరాబాద్‌లో పెట్టుబడులు అధికంగా కేంద్రీకృతం కావడం వల్ల ఏపీలోని మిగిలిన ప్రాంతాలు ఎక్కువగా వ్యవసాయాధారంగా ఉన్నాయని, మార్పు తీసుకురావడానికి, వైజాగ్ వృద్ధి పై మనం దృష్టి పెట్టాలని, తద్వారా పదేళ్లలో మనం హైదరాబాద్, బెంగళూరుతో పోటీ పడవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు 90 శాతం హైదరాబాద్‌కే పరిమితం అయ్యాయన్నారు. అద్భుతమైన ప్రగతి సాధించిన హైదరాబాద్‌ను రాష్ట్ర విభజనతో వదులుకోవాల్సి వచ్చిందన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో సర్వీస్ సెక్టార్ తెలంగాణలో 62 శాతం ఉండగా, ఆంధ్ర ప్రదేశ్‌లో 40 శాతం మాత్రమే ఉందన్నారు. తలసరి ఆదాయం కూడా తెలంగాణ లో 3.12 లక్షలు ఉంటే ఏపీ లో 2.9 లక్షలు మాత్రమే ఉందన్నారు. సుదూర సముద్ర తీరంలో పోర్టులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ, మూల పాడు పోర్టులు అత్యంత వేగంగా నిర్మితమవుతున్నట్లు చెప్పారు. సర్వీస్ సెక్టార్‌ను విస్తృతం చేయడమే విజన్ విశాఖ లక్ష్యమన్నారు. గ్రీన్ ఫీల్డ్ ఎలక్ట్రానిక్ క్లస్టర్స్ కడప, అనకాపల్లి జిల్లాల్లో ఏర్పాటు అవుతున్నాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ 1లో ఉన్నామన్నారు. గత మార్చిలో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో 13 లక్షల కోట్ల విలువ చేసే 360 ఎంఓయూలలో 39 శాతం ఎంఓయూలు గ్రౌండ్ అయ్యాయని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించామని చెప్పారు. పెద్ద పరిశ్రమలు 3, 4 లక్షల ఉద్యోగాలు అందిస్తే ఎంఎస్ఎంఈలు 30 లక్షల ఉద్యోగాలను కల్పిస్తున్నాయన్నారు. 1.5 కోట్ల మహిళలు స్వయం ఉపాధిని సాధించారన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలోనే వ్యవసాయం రంగంలో ఏపీలో 70 శాతం వృద్ధి సాధించామని సీఎం జగన్ పేర్కొన్నారు. విశాఖ ఇంకా చాలా అభివృద్ధి చెందాల్సి ఉందని సీఎం జగన్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ప్రతిపక్షం ఈ రాష్ట్రంలో ఉండటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ నుంచి పరిపాలనను అడ్డుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎగ్జిక్యూటివ్ కేపిటల్‌గా ఉంటే ఈ నగరం అభివృద్ధి బహుముఖంగా జరుగుతుందన్నారు. తనకు ఏమీ వ్యక్తిగత ఆలోచనలు, ప్రయోజనాలు లేవని...రాష్ట్ర అభివృద్ధి ఒక్కటే తన లక్ష్యమన్నారు. బెంగళూరు, చెన్నై తరహాలో అభివృద్ధి చెందే అవకాశం వైజాగ్‌కు ఉందని సీఎం జగన్ తెలిపారు.

చంద్రబాబుకు బలముంటే పొత్తు ఎందుకు?

వడ్డెర ఆత్మీయ సదస్సులో సజ్జల

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: చంద్రబాబుకు బలం ఉంటే ఆయన పొత్తులు పెట్టుకోవడం ఎందుకంటూ వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సూటిగా ప్రశ్నించారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మంగళవారం వడ్డెర ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సజ్జలతోపాటు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, వివిధ ప్రాంతాలకు చెందిన వడ్డెర సంఘం నేతలు హాజరయ్యారు. సజ్జల మాట్లాడుతూ, వైసీపీలో అవకాశం దక్కని వారే బటయకు వెళ్తున్నారని స్పష్టం చేశారు. వలంటీర్ల వ్యవస్థపై తాము గర్వంగా ఫీలవుతున్నామని, చంద్రబాబు తన జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తానని చెప్పగలరా అని నిలదీశారు. కొత్తగా వచ్చిన పార్టీ తరహాగా చంద్రబాబు బీసీలపై హామీలిస్తున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి గుమ్మనూరు జయరామ్‌కు వైసీపీలో టికెట్టు నిరాకరించినందునే ఆయన పదవికి రాజీనామా చేశారని, అనంతరం టీడీపీలో చేరుతున్నారని వివరించారు. నాడు జయరామ్ అక్రమాలు చేశారంటూ చంద్రబాబు విమర్శించి, ఆయనను ఎలా టీడీపీలో చేర్చుకుంటున్నారని నిలదీశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల్లో వడ్డెరలకు పూర్తి న్యాయం జరుగుతోందన్నారు. చంద్రబాబుకు అనుకూలంగా సర్వేలు లేవని, అయినప్పటికీ అనుకూలంగా ఉన్నట్లు తన అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుంటున్నారని విమర్శించారు. ఎస్సీ, బీసీ డిక్లరేషన్ పేరుతో చంద్రబాబు మాయమాటలు చెబుతున్నారని అన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు ఏం చేశారని, జన్మభూమి కమిటీల పేరుతో మాఫియా గ్యాంగ్‌ను చంద్రబాబు తయారు చేశారన్నారు. చివరికి మరుగుదొడ్ల విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని, రాజధాని పేరుతో అతి పెద్ద స్కామ్ చేశారని దుయ్యబట్టారు. నాడు ఇక చాలంటూ ప్రజలు 2019లో చంద్రబాబును సాగనంపారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తోందని, మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. నాడు వైసీపీ నుంచి 23 ఎమ్మెల్యేలను తీసుకుని, పార్టీని తొక్కాలని చూసినా, సీఎం జగన్ ధీటుగా ఎదుర్కొన్నారని, ఆయా వర్గాల్లో నాయకత్వం పటిష్ఠత కోసం జగన్ చాలా కష్టపడ్డారని గుర్తుచేశారు. జగన్‌కు ఉన్న నిబద్ధత మరొకరికి లేదని స్పష్టంచేశారు.

కాంగ్రెస్ అధికార ప్రతినిధుల జాబితా విడుదల

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కాంగ్రెస్ అధికార ప్రతినిధుల జాబితాను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎస్.తులసిరెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఏఐసీసీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ ఆమోదంతో వివిధ జిల్లాల నుంచి 19 మంది పేర్లను వెల్లడించారు. గంగాధర్ (అనకాపల్లి), జెర్రిపోతుల ముత్యాలు (విశాఖపట్నం), కె.వీరన్న పదాలు (అల్లూరి సీతారామరాజు), కాటం రవి (తూర్పుగోదావరి), గడ్డం సురేశ్‌బాబు (బీఆర్ అంబేద్కర్ కోనసీమ), కొవ్వూరి శ్రీనివాస్ (తూర్పుగోదావరి), రుద్రరాజు గోపాల కృష్ణంరాజు (బీఆర్ అంబేద్కర్ కోనసీమ), డీవీఆర్‌కే చౌదరి (ఏలూరు), మొహమ్మద్ హాజీ సర్వార్ బేగ్ (ఎన్టీఆర్), కర్నాటి అప్పారావు (ఎన్టీఆర్), గోవిందు శంకర్ శ్రీనివాస్ (పల్నాడు), చిన్న రామాంజనేయులు (కర్నూలు), నేతి మహేశ్ (ప్రకాశం), ప్రియాంకా దండి (విశాఖపట్నం), పూల నజీర్ అహ్మద్ (వైఎస్ఆర్), పూల భాస్కర్ (అన్నమయ్య), రామా నాయుడు (అనంతపురం), ఎం.గోపాల్‌రెడ్డి (తిరుపతి), పూతలపట్టు ప్రభాకర్ (చిత్తూరు) ఉన్నారు.

'సఫాయి మిత్ర' సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రాష్ట్రంలో సఫాయి కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సఫాయి మిత్రయాప్ దోహద పడుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు అన్నారు. విజయవాడ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సఫాయి మిత్ర సర్వేయాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం చంద్రుడు మాట్లాడుతూ, పురపాలక సంఘాలు, పంచాయతీల పరిధిలో పనిచేస్తున్న సఫాయి కార్మికుల సేవలు అజరామరమని కొనియాడారు. వీరి జీవనోపాధిని పెంపొందించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో పని చేసే సఫాయి కార్మికుల గుర్తింపు ప్రక్రియలో భాగంగానే ఈ సఫాయి మిత్ర సర్వే యాప్‌ను ప్రారంభించామని గంధం చంద్రుడు వెల్లడించారు. గ్రామాల్లో గ్రామ సచివాలయ కార్యదర్శులు, పట్టణాల్లో పారిశుధ్య విభాగం వార్డు కార్యదర్శులు సఫాయి కార్మికుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే సక్రమంగా కొనసాగించి సఫాయి కార్మికుల సమాచారాన్ని సమగ్రంగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సేవల్లో మరణాలు సంభవించకుండా ప్రమాదరహిత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోబడతాయని ఆయన వెల్లడించారు. సఫాయి కార్మికులకు కనీస వేతనాలు నిర్ధారించడంతో పాటు ఆరోగ్య భద్రత మెరుగుపరచడానికి ఈ యాప్ ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగినుల సమస్యలు పరిష్కరిస్తాం

విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్

విశాలాంధ్ర–విశాఖ: మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ హామీ ఇచ్చారు. ఏపీపీటీడీ (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ విజయనగరం జోనల్ కమిటి ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 19 డిపోల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో మంగళవారం సింహాచలంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ, ఉద్యోగినులకు సంబంధించిన పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయని అన్నారు. వాటిని సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 5,317 మంది మహిళా ఉద్యోగులు వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారని చెప్పారు. మహిళా కండక్టర్లే 4,589 మంది ఉన్నారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించినందున ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగినులకు ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు అందుతున్న అన్ని సౌకర్యాలను ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మహిళల ఇబ్బందులను అర్థం చేసుకోవాల్సిన మహిళా అధికార్లు, సూపర్ వైజర్లే మహిళా కండక్టర్ల పాలిట శత్రువులుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ నెలసరి సెలవులు ఇవ్వడానికి కొంతమంది సూపర్‌వైజర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చైల్డ్ కేర్ లీవులు ఆరునెలలు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ మంజూరు చేయడంలేదని అన్నారు. అన్ని డిపోల్లో రెస్టు రూమ్స్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్స్ ఏర్పాటు చేయాలని, మహిళా కండక్టర్లు రాత్రి తొమ్మిది గంటలు లోగా డ్యూటీ దిగేటట్లు డ్యూటీ ఛార్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సమస్యలను మేనేజ్ మెంట్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. విశాఖపట్నం డీపీటీవో ఎ. అప్పలరాజు, డిప్యూటీ సీటీఎం (ఓ అండ్ సీ) బి.అప్పలనాయుడు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ టి. వాణి నీలిమ, సింహాచలం డిపో మేనేజర్ రాజ్ శేఖర్ ప్రసంగించారు. ఈయూ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.జె.శుభాకర్, బాసూరి కృష్ణమూర్తి పర్యవేక్షణలో జోనల్ సహాయ కార్యదర్శి పి.పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి నందమూరి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జోనల్ కమిటీ నేతలు పాల్గొన్నారు. ఉద్యోగినులను సత్కరించారు.

సైనిక్ వెల్ఫేర్ బోర్డు మేనేజింగ్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర–విజయవాడ: రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ బోర్డు మేనేజింగ్ కమిటీ సమావేశం గవర్నర్, మేనేజింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన మంగళవారం రాజ్ భవన్‌లో జరిగింది. సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వి.వెంకట రెడ్డి... సైనిక్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పనితీరు, గత కొన్నేళ్లుగా నిర్వహించిన కార్యక్రమాలను కమిటీ సభ్యులకు వివరించారు. విశ్రాంత సైనికులు, డిపెండెంట్ల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను సమీక్షించడానికి, వివిధ పథకాల కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు, గ్రాంట్లు తదితరల పెంపునకు ప్రతిపాదించిన నిర్ణయాలను పరిశీలన కోసం సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కమిటీ సభ్యులకు సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి, హోంశాఖ ప్రధాన కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా, తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా సికింద్రాబాద్ మేజర్ జనరల్ రాకేశ్ మనోచా, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి జి. విజయ్ కుమార్, హెచ్‌క్యూ డైరెక్టర్ బ్రిగ్ రోహిత్ మెహతా, సదరన్ కమాండ్ పూణే జాయింట్ సెక్రటరీ ఏకే ధర్ పాల్గొన్నారు.

అప్పులు తేవడంలో జగన్ పీహెచ్‌డీ: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: మీ బిడ్డనంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై కొంచెం జాగ్రత్తగా ఉండాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చాక ఆయన సొంత కంపెనీలు కళకళలాడుతుంటే... రాష్ట్ర ఖజానా దివాలా తీసిందన్నారు. ఒక్కటంటే ఒక్క కొత్త కంపెనీ తెచ్చి యువతకు ఉద్యోగాలు ఇవ్వడం చేతకాని సీఎం, అప్పులు తేవడంలో మాత్రం పీహెచ్‌డీ చేశారని ఎద్దేవా చేశారు. "రాష్ట్ర పరిపాలనా కేంద్రం సచివాలయాన్ని రూ.370 కోట్లకు జగన్ తాకట్టుపెట్టారు... ఖనిజ సంపద తనఖాతో రూ.ఏడు వేల కోట్లు, మందుబాబులను తాకట్టుపెట్టి రూ.33 వేల కోట్ల అప్పులు తెచ్చారు... ఆయన జమానాలో మిగిలింది కేవలం ఐదు కోట్ల మంది జనం మాత్రమేనన్నారు. ఇప్పటికీ తాను మీ బిడ్డనంటూ వేదికలపై ఊదరగొడుతున్న జగన్ మాటల వెనుక ఆంతర్యాన్ని ప్రజలు గుర్తించాలి. రాబోయే రెండు నెలలు ఆయనతో జాగ్రత్తగా ఉండాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లోకేశ్ మంగళవారం ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు.

సీఎస్‌కు సత్కారం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ డే పాటించాలని జారీజేసిన ప్రభుత్వ ఉత్తర్వులను స్వాగతిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్. జవహర్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సత్కరించింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.రమేశ్‌కుమార్ తదితరులు కలిసి ఆయనను కార్యాలయంలోనే శాలువాతో సత్కరించారు. ఉత్తర్వుల విడుదలలో విశేష కృషి చేసిన సీఎస్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్షుడు గౌస్, డిప్యూటీ కలెక్టరు చేబ్రోలు కృష్ణ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రివర్గం నుంచి 'గుమ్మనూరు' బర్తరఫ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: టీడీపీలో చేరిన మంత్రి గుమ్మనూరు జయరామ్‌పై వైసీపీ అధిష్ఠానం వేటు వేసింది. వైసీపీ అధినేత, సీఎం జగన్ సిఫార్సు మేరకు జయరామ్‌ను మంత్రివర్గం నుంచి గవర్నర్ బర్తరఫ్ చేశారు. మంగళగిరిలో మంగళవారం జరిగిన టీడీపీ, జనసేన సభలో ఆయన టీడీపీలో చేరారు. ఈనెల 4న విజయవాడ కేంద్రంగా ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించి, తాను పార్టీకి, మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీలో చేరిన వెంటనే మంత్రి వర్గం నుంచి జయరామ్‌ను బర్తరఫ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో జయరామ్‌ను కర్నూలు ఎంపీగా పోటీ చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. అందుకు ఆయన అసంతృప్తికి గురై కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉన్నారు. టీడీపీ నేతలతో టచ్‌లోకి వెళ్లి, ఆయన పోటీ చేసే నియోజకవర్గంపై స్పష్టత వచ్చాక పార్టీ వీడారు.

'కృత్తివెంటి'కి డి.లిట్ డిగ్రీ ప్రదానం

విశాలాంధ్ర–విజయవాడ: కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు ప్రతిష్ఠాత్మకమైన డి.లిట్ లభించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్పూర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్... డాక్టర్ కృత్తివెంటికి డి.లిట్. డిగ్రీ ప్రదానం చేశారు. భారతీయ భాషలకు, సాహిత్యానికి విశేషమైన సేవలు అందించినందుకు, రెండు దశాబ్దాలుగా కేంద్ర సాహిత్య అకాడమీని అభివృద్ధి పథంలో నడిపించిన పరిపాలనా దక్షతకు గుర్తింపుగా గౌరవ డాక్టర్ ఆఫ్ లిటరేచర్ డిగ్రీ ప్రదానం చేస్తున్నట్టు బస్తర్‌లోని షహీద్ మహేంద్ర కర్మా విశ్వవిద్యాలయం ప్రకటించింది. కృష్ణాజిల్లా పెదప్రోలుకు చెందిన శ్రీనివాసరావు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఇంగ్లిషులో డాక్టరేట్ చేశారు.

తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

ప్రధాని మోదీకి సీఎం వినతి

విశాలాంధ్ర–హైదరాబాద్: రెండురోజుల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్ర పర్యటన ముగించుకుని మంగళవారం ఒడిశా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలు అంశాలతో కూడిన వినతిపత్రాలను ప్రధానికి అందజేశారు. ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం ఉంటే గత ప్రభుత్వం 1,600 మెగావాట్లు మాత్రమే సాధించిందని, మిగిలిన 2,400 మెగావాట్ల ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని అనుమతులు ఇస్తామన్నారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణ అభివృద్ధికి, మూసీ ప్రక్షాళన రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధాని జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ ఫారెస్ట్ ఏరియా మీదుగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సహకరించాలని, దీనికి 2022–23లోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ.మూడు కోట్లు మంజూరు చేసిందన్నారు. రూ.7,700 కోట్ల అంచనా ఖర్చయ్యే ఈ ప్రాజెక్టును మంజూరు చేసి ఈ కారిడార్‌తో అటు శ్రీశైలం వెళ్లే యాత్రికులతో పాటు హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లా వరకు 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని అలాగే దక్షిణ తెలంగాణ వైపు రవాణ మార్గాలు విస్తరిస్తాయన్నారు.

రాష్ట్రంలో నూటికి నూరు శాతం ఇంటింటికీ నల్లా నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీళ్లు అందటం లేదని, సమీపంలోని నీటి వనరుల ద్వారా గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్య, పోలీస్ కమిషనరేట్ల సంఖ్యకు అనుగుణంగా ఐపీఎస్ క్యాడర్ రివ్యూ చేయాల్సిన అవసరం ఉందని, కేంద్ర హోంశాఖ 2016లో తెలంగాణకు 76 ఐపీఎస్ కేడర్ పోస్టులను మంజూరు చేసిందని కానీ జిల్లాల పునర్వ్యవస్థీకరణ, పెరిగిన జనాభాను బట్టి రాష్ట్రంలో పోలీసు అధికారుల అవసరం పెరిగిందన్నారు. అత్యవసరంగా 29 పోస్టులను అదనంగా కేటాయించాల్సి ఉందని, ఐపీఎస్ క్యాడర్ రివ్యూను అత్యవసర అంశంగా పరిగణించి వీలైనంత త్వరగా పోస్టులు మంజూరు చేయాలన్నారు. హైదరాబాద్–రామగుండం, హైదరాబాద్–నాగ్‌పూర్ రహదారిపై రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. వీటితో పాటు కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీల కేశవపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1,350 ఎకరాల మిలిటరీ డెయిరీ ఫామ్ ల్యాండ్స్ (తోఫెఖానా) రాష్ట్రానికి బదిలీ చేసి లీజు గడువు ముగిసిన శామీర్ పేటలో ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ (1038 ఎకరాల) భూములను తిరిగి అప్పగించాలన్నారు. ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీ తో పాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయి. అత్యున్నత విద్యా సంస్థలు అందరికీ అందుబాటులో ఉండాలని ప్రతి రాష్ట్రంలో ఒక ఐఐఎం నెలకొల్పాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుందన్నారు. అందులో భాగంగా హైదరాబాద్‌లో ఐఐఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) నెలకొల్పాలని, అందుకు అవసరమైనంత స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందని పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్నామని, 5,259 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని, 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర వాటాగా రాష్ట్రానికి రావాల్సిన రూ.347.54 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. భారత్ మాల పరియోజన జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణకు ప్రయోజనంగా ఉండే ఎనిమిది ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కల్వకుర్తి–కొల్లాపూర్, గౌరెల్లి–వలిగొండ, తొర్రూర్–నెహ్రూనగర్, నెహ్రూనగర్–కొత్తగూడెం, జగిత్యాల–కరీంగర్ ఫోర్ లేన్, జడ్చర్ల–మరికల్ ఫోర్ లేన్, మరికల్–డియసాగర్ నిలిచిపోయిన టెండర్ల ప్రక్రియకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారాన్ని కోరుతున్నామని, ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్‌లో ప్రధాన పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుందన్నారు. సెమీ కండక్లర్లు, డిస్ ప్లే మ్యానుఫ్యాక్షరింగ్ రంగంలో కొత్త శకానికి నాంది పలికేందుకు ఇండియా సెమీ కండకర్ల మిషన్లో భాగంగా కేంద్రం సాయం అందించాలన్నారు.

శ్రీ శివాలయం
నందిపల్లి గ్రామం,
వేంపల్లి మండలం, కడప జిల్లా
e-Procurement Tender
NIT No.P/COE / 175 /2024, Dt : 02-02-2024
దేవాలయ అభివృద్ధి పనుల కొరకు
e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది.
వివరములకు ఈ క్రింది వెబ్‌సైట్‌ను చూడగలరు.
https://tender.apeprocurement.gov.in
ఇట్లు : ధర్మకర్త

Government of Andhra Pradesh
AP Building & Other Construction Workers Welfare Board A.P, Vijayawada
e-Procurement Tender Notice No. C/442/2024
Tenders are invited by the undersigned from the Agencies of Chartered Accountants agency for book keeping and accounting services including preparation of annual accounts, compliance of tax matters for the financial year 2024-25 for the Andhra Pradesh Building and Other Construction Workers Welfare Board. Tender documents will be available in www.apeprocurement.gov.in from 06-03-2024 at 06.00 PM to 13-03-2024 at 5.00 PM. For other details please visit www.apeprocurement.gov.in. Any modifications/ Amendment/ Corrigendum will be uploaded in the e-procurement portal only as given above, and no separate notification will be issued. Sd/- M.V. Seshagiri Babu, I.A.S., Secretary & CEO

సంపాదకీయం

తెగిన సంకెళ్లు

ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ గోకరకొండ నాగ సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని నాగపూర్ లోని బొంబాయి హైకోర్టు మంగళవారం నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో వారికి జీవితఖైదు విధిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. 90 శాతం అవయవాలు పని చేయని డా.సాయిబాబాకు ఈ తీర్పు స్వల్ప ఉపశమనమే కావచ్చు. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణతో సాయిబాబాతో పాటు మరో ఐదుగురిని మహారాష్ట్ర పోలీసులు 2014 మేలో అరెస్టు చేశారు. సాయిబాబాకు ఇంతకు ముందు రెండుసార్లు బెయిలు మంజూరు అయింది. అయినా ఆయన విడుదల కాకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టు దాకా వెళ్లి అడ్డుకుంది. సాయిబాబును నిర్దోషిగా ముంబయి హైకోర్టు నేడు చెప్పిన తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సాయిబాబాపై కేసును ప్రాసిక్యూషన్ వారు రుజువు చేయలేకపోవడంతో ఆయనను నిర్దోషిగా కోర్టు తీర్పు చెప్పింది. మొదటిసారి 2015లో బొంబాయి హైకోర్టు, తరవాత 2016 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సాయిబాబాకు బెయిలు మంజూరు చేసినా ఆయనకు విముక్తి అయితే కలగలేదు. ఆయన మీద నేరారోపణ రుజువై జైలు శిక్షపడ్డ 2017 మార్చి ఏడు నుంచి సాయిబాబా నాగపూర్ జైలులోనే ఉన్నారు. ఏమైతేనే చిన్నప్పుడు పోలియో సోకినందువల్ల 90 శాతం అవయవాలు పనిచేయని సాయిబాబాకు తాత్కాలికంగానైనా జైలు జీవిత యాతన నుంచి ఉపశమనం కలిగింది. హైకోర్టులు, సుప్రీంకోర్టు సందర్భం వచ్చినప్పుడల్లా బెయిలు హక్కు, తప్పనిసరి పరిస్థితిలోనే జైలు అన్న ఆకర్షణీయమైన సూత్రాన్ని వల్లిస్తుంటాయి. కానీ అనేక మంది ఎన్నిసార్లు ఎన్ని కోర్టుల మెట్లెక్కినా బెయిలు రాని ఉదంతాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఉదారవాద అభిప్రాయాలు ఉన్న, రాజ్యాంగాన్ని గౌరవించే న్యాయమూర్తులు కూడా సాయిబాబా విషయంలో బెయిలు ఇవ్వకుండా కాళ్లీడ్చారు. రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఇస్తుందని న్యాయమూర్తులు చెప్తూనే ఉంటారు. 90 శాతం శరీరం నిస్తేజం అయిన సాయిబాబాలాంటి వారు రాజ్య వ్యవస్థను, లేదా ప్రభుత్వాన్ని ఎలా కూల్చి వేయగలరో మాత్రం ఒక్కసారైనా ఆలోచించరు. సాయిబాబాకు ఒంట్లో సత్తువ లేదు. ఆయన తనంత తాను బట్టలు వేసుకోలేరు. భోజనం చేయలేరు. మంచి నీళ్లు కూడా తాగలేరు. కానీ గత పదేళ్లుగా ఆయన మనోబలం ఎన్నడూ క్షీణించలేదు. నమ్మిన సిద్ధాంతం నుంచి అరక్షణమైనా బెసకలేదు. ఒక పేజీ రాయడానికి ఒక రోజంతా పట్టే సాయిబాబా లాంటి దివ్యాంగుడు వ్యవస్థను కూల్చేయగలడన్న ఆరోపణలను కోర్టులు ఎలా నమ్ముతాయో తెలియదు. జైలులో ఆయనను కలుసుకోవాలనుకున్నప్పుడల్లా ఆయన భార్య వసంత 14 గంటలు రైలులోనో, బస్సులోనో ప్రయాణించవలసి వచ్చేది. 2014లో అరెస్టుచేసి 2017కల్లా విచారణ పూర్తి చేసి శిక్ష వేయడం ఒక రకంగా కోర్టులు ఆఘమేఘాల మీద పని చేసినట్టే. భీమా కోరేగావ్ కేసులో అరెస్టయిన మేధావులు, పౌర హక్కుల కార్యకర్తలు, రచయితలు అరెస్టై అయిదేళ్లుపూర్తి అయినా కనీసం బెయిలైనా దక్కింది కొద్ది మందికే. అంటే న్యాయవ్యవస్థ మందకొడి తనంలో నత్తకు నడకలు నేర్పే స్థాయిని మించిపోయిందనుకోవాలి. ఇంతకు ముందు సాయిబాబాకు హైకోర్టు బెయిలు మంజూరు చేస్తే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి ఆ బెయిలును రద్దు చేయించింది. 2022 అక్టోబర్ 14న సుప్రీంకోర్టు హైకోర్టు మంజూరు చేసిన బెయిలును కూడా రద్దు చేసింది. ప్రభుత్వం పెట్టుకున్న అర్జీని సుప్రీంకోర్టు ఇసుమంత కూడా జాప్యం లేకుండా విచారించి బెయిలు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆ పిటిషన్‌ను విచారించిన బెంచీలో ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ కూడా ఉన్నారు. ఆ తరవాత మూడు రోజులకే ఆయన ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. అప్పుడు ఈ కేసును హైకోర్టు మళ్లీ సమగ్రంగా విచారించాలని హైకోర్టుకు తిప్పి పంపారు. 2021లో మొదటి సారి, 2022లో రెండోసారి సాయిబాబాకు కరోనా వ్యాధి సోకింది.

దుర్బల శారీరక స్థితిలో ఉన్నవారు జైళ్లల్లో ఉండగానే మరణించడం మన దేశంలో కొత్తేమీ కాదు. తాజా ఉదాహరణగా స్టాన్‌స్వామి అలా మరణించిన జాబితాలో చేరిపోయారు. సాయిబాబాతో పాటు అరెస్టయిన నరోట్ ఫ్లూ సోకి సరైన చికిత్స అందక 2022లో ప్రాణాలు వదిలారు. ఏటా కనీసం ఇలా రెండువేల మంది మరణిస్తారని ప్రభుత్వ లెక్కలే చెప్తున్నాయి. ప్రభుత్వాలకు, కోర్టులకు ఈ దారుణం చూసి చీమ కుట్టినట్టైనా ఉండకపోవడం ఆశ్చర్యకరం కాదు. ఎందుకంటే మన వ్యవస్థ అంతగా బండబారిపోయింది. రాజ్యవ్యవస్థను కూల్చేయాలని కుట్రపన్నారని శారీరకంగా అశక్తుడైన సాయిబాబా మీద కేసు మోపడం బధిరాంధులను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఆయన మీద చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు మోపారు. ఈ చట్టం కింద బెయిలు రావడం దుర్లభం అంటారు. బెయిలు కూడా దక్కకుండా, విచారణ ఊసే లేకుండా కేవలం ఆరోపణ ఆధారంగా నిరవధికంగా జైలులో మగ్గేట్టు చేయడమే ఇలాంటి కిరాతక చట్టాల పరమ లక్ష్యం. సుప్రీంకోర్టు బెయిలు రద్దు చేసినప్పుడు ఈ బాధ ఇక ఎంత మాత్రం భరించలేనని సాయిబాబా నిట్టూర్చారు. సాయిబాబాకు అంగవైకల్యంతో పాటు గుండె జబ్బు, మెదడులో ద్రవకోశం, మూత్ర పిండాల్లో రాళ్లు, క్లోమ సంబంధ సమస్య, వెన్నుపూస నొప్పితో పాటు అనేక రుగ్మతలున్నాయి. ప్రతి వ్యక్తికి జీవించే హక్కు ఉందని ఊదరగొట్టే న్యాయమూర్తులకు ఇన్ని రుగ్మతలున్న వ్యక్తిని భయంకరమైన పరిస్థితుల్లో జైలులో ఉంచడం జీవించే హక్కుని నానాటికీ హరింప చేయడమని ఎందుకు తట్టదో తెలియదు. ఏ వ్యక్తికైనా బెయిలు మంజూరు అయితే తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఆ ఉత్తర్వును గౌరవించాలి. కానీ అలాంటి తప్పనిసరి పరిస్థితులు లేకపోయినా సుప్రీంకోర్టు ఆయన బెయిలును రద్దు చేసిన వైనం గడ్డకట్టుకు పోయిన న్యాయమూర్తుల జడత్వాన్ని రుజువు చేస్తుంది. శారీరక వైకల్యం చిన్నప్పటి నుంచి సాయిబాబా ఆత్మస్థైర్యానికి ఎన్నడూ ఆటంకం కాలేదు. ఆయన చదువుకునే సమయంలో అందరికన్నా ముందుండేవారు. సమానత్వం అంటే ఆయనకు ప్రాణం. జైలులో సాయిబాబా లాంటి వారు ఎంత దుర్భర జీవితం గడపవలసి వస్తుందో చెప్పడం కూడా కష్టమే. ఆయన తనంత తాను కాలకృత్యాలు తీర్చుకోలేరు. స్నానం చేయలేరు. బట్టలు మార్చుకోలేరు. పైగా ఆయనను ఉంచిన సెల్లులో నిరంతరం కెమెరా కన్ను నిఘా ఉంటుంది. ఆయన ఏం చేస్తున్నారో జైలు సూపరింటెండెంట్ కార్యాలయ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. చట్టాలకు, న్యాయశాస్త్ర నియమాలకు అనుగుణంగా కోర్టులు వ్యవహరించడం అరుదైపోయిన సమయంలో సాయిబాబాకు బెయిలు రావడం అబ్బురమే. చట్టానికి, రాజ్యాంగానికి నిబద్ధమై ఏ కోర్టు అయినా తీర్పులు చెప్తే అది సాహసోపేతమైన నిర్ణయం అంటున్నాం. ఆ న్యాయమూర్తులను నోరారా పొగడుతున్నాం. అంటే చట్టానికి, న్యాయానికి కట్టుబడడం వీరోపచితమైన కార్యకలాపం అయిపోయింది.

లోక్‌సభ ఎన్నికల్లో కీలకం మహిళా ఓటర్లే

సుశీల్ కుట్టి

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్య మహిళా ఓటర్లే. మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉన్న పశ్చిమ బెంగాల్‌లో ఇది మరింత ఎక్కువనే చెప్పవచ్చు. అయితే బెంగాల్‌లో మహిళల హక్కులు, మహిళల సంరక్షకులు ప్రధాని నరేంద్ర మోదీనా లేక తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత ఇద్దరిలో ఎవరనేది నిరూపించే యుద్ధ సమయం ఆసన్నమైంది. బెంగాల్‌లో సందేశ్ ఖాలిలో టీఎంసీ నాయకుడు షేక్ షాజహాన్ ప్రమేయం ఉన్న సందేశ్‌ఖాలీ నిర్వహించిన అత్యాచారాలు, దహనాలు, దోపిడీ, హత్యలు భూములను ఆక్రమించుకోవడం వంటి సంఘటనలు తారాస్థాయికి చేరిన ప్రస్తుత సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 1, 2 తేదీల్లో బెంగాల్ సందర్శన చేపట్టడం విశేషం. అయితే మహిళలపై షాజహాన్ చేసిన అకృత్యాలపై ప్రభుత్వ అప్రతిష్టను తగ్గించుకునేందుకు మమత ఒక రోజు ముందు అతనిని అరెస్టుచేయడం పెద్దనాటకం. ప్రధాని మోదీ, మమతా ఇద్దరికీ సందేశ్‌ఖలీలో మహిళలపై జరిగిన అఘాయిత్యాలను ఎన్నికల వ్యూహంగా మలుచుకుంటున్నారు. పశ్చిమబెంగాల్ సహా దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మహిళా ఓటర్లు ప్రధాన చర్చగా ఉన్నారు. కేవలం వంటగ్యాస్ విషయంలో మాత్రమే మహిళా ఓటర్లను బీజేపీ ఆకర్షించలేదని, మోదీ ఇచ్చిన హామీలను ఎట్టిపరిస్థితుల్లోనూ నెరవేర్చలేరని బీజేపీ ఎన్నికల ఎత్తుగడలో భాగం అని మమత విమర్శిస్తున్నారు. మహిళలు మోదీ అసలు స్వభావాన్ని గుర్తించకుండా బీజేపీకి ఓటు వేస్తే మాత్రం వెన్నులో కత్తి దించడం వంటిదే. వరుసగా మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే తదనంతరం పశ్చాత్తాపపడే పరిస్థితి మహిళలకు దాపురిస్తుందని మమత ప్రచారసభల్లో తరచూ ప్రస్తావిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో బెంగాల్‌లోని సందేశ్‌ఖలీ భయానక పరిణామాలపై మమత ఒకింత ఆందోళన చెందుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 50శాతం మహిళా ఓటర్లున్నారు. మొత్తంగా కాకపోయినా ఈ ఎన్నికల్లో మెజారిటీ మహిళా ఓటర్లను ప్రధానంగా ఆకర్షించేందుకు బీజేపీ గాలం వేస్తోంది. అక్కడి మహిళల ఓట్లని రాబట్టుకోవటం బీజేపీకి పెద్ద టాస్క్‌గా ఉంది. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళనకు ప్రధాన కారణం బీజేపీ మాత్రమే కాదు, కాంగ్రెస్, వామపక్షాల ప్రమేయం కూడా ఉంది. అయితే మమత సరైన సమయంలో షేక్ షాజహాన్‌ను వదిలించుకునే ప్రయత్నం చేయడం ఎన్నికల ఎత్తుగడలో భాగమే. ప్రధానమైె నది నరేంద్ర మోదీని తిరిగి అధికారంలోకి రాకుండా నిరోధించడం మమత లక్ష్యం. మోదీ తిరిగి అధికారంలోకి వస్తే ఎల్‌పీజీ గ్యాస్ ధరలను పెంచడంతో పాటు కనీసం, గ్యాస్ ధరల గురించి స్త్రీలు మాట్లాడేందుకు కూడా వీలులేని పరిస్థితి కల్పిస్తారని మమత మహిళా ఓటర్లను భయపెడుతున్నారు. మోదీ పాలనలో మహిళలు వంటచెరకు సేకరించడం కూడా ఆందోళన కలిగించే అంశమని ఆమె ర్యాలీలో విమర్శిస్తున్నారు. మేము మాత్రం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తాము ... బీజేపీ మళ్లీ గెలిస్తే, గ్యాస్ ధరను రూ. 1,500-2,000 వరకు పెంచవచ్చు. మీరు వంట కోసం మళ్లీ ఆవు పేడ, కలపను సేకరించే పరిస్థితి వస్తుందని మమత తన ప్రసంగాల్లో హెచ్చరిస్తున్నారు. వాస్తవం ఏమిటంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో పెరిగిన ధరల గురించి దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. దేశంలో మతపరమైన విద్వేష పరిస్థితులను మమత లేవనెత్తుతున్నారు. విద్వేషం తలెత్తడానికి కాషాయదళాలే కారణమన్నారు. గ్యాస్, హౌసింగ్ రెండూ మహిళా ఓటర్లకు ముఖ్యమైనవి. ముఖ్యమైన విషయం ఏమిటంటే, మహిళా ఓటర్లు మరో ఐదేళ్లలో పురుష ఓటర్లను అధిగమిస్తారని, తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రాలలో, మహిళలు అగ్రగామిగా లేకుండా ఏ ప్రభుత్వం ఏర్పడదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి నొక్కి చెబుతున్నారు.

పాట్నా ర్యాలీ ఎన్డీయేకు కంటకమే

అరుణ్ శ్రీ వత్సవ

బీహార్ రాజధాని పాట్నానగరం గాంధీ మైదాన్‌లో ఆదివారం ఇండియా కూటమి నిర్వహించిన గొప్ప ర్యాలీ ఎన్డీయేకు కంటకమే. ఈ ర్యాలీ బీజేపీకి దడపుట్టించింది. మార్చి 3న జరిగిన ఈ ప్రదర్శన రాష్ట్ర ప్రజలను ఆశ్చర్యపరిచింది. ప్రత్యర్థులలో ఆందోళన కలిగించింది. దళితులు, కార్మికులు తమ హక్కుల కోసం నినదించారు. ఈ భారీ ర్యాలీ దేశవ్యాప్తంగా గొప్ప సందేశాన్ని వ్యాపింప చేసింది. అధికారాన్ని పంపిణీ చేసుకునేందుకు పేదలు, సంపన్నులకు మధ్య పోరాటానికి అవకాశం కలిగింది. ఇండియా కూటమి పార్టీలకు అ సభ ఎంతగానో ప్రోత్సాహన్నిచ్చింది.దాదాపు పదిలక్షల మంది సభలో పాల్గొన్నారు. రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్, మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖడ్గే, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రసంగాలు సభకు హాజరైన వారిని గొప్పగా ఉత్తేజపరిచాయి. మహాఘట్ బంధన్ మొదటి ఎన్నికల ప్రచారసభ ఉగ్రూత లూగించింది. బీహార్‌లో 40సీట్లు, ఉత్తరప్రదేశ్‌లో 80 సీట్లున్నాయి. రెండు రాష్ట్రాల్లో మొత్తం 120 సీట్లున్నాయి. ఇండియా కూటమి 120 సీట్లను గెలుచుకుని ఈ ప్రాంతం నుంచే ప్రధాని కావాలని, ఇండియా కూటమి నుంచే ప్రధాని అవుతారని అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గట్టిపోటీ ఇవ్వడమేకాక గెలుపొందే అవకాశాలున్నాయని ప్రజలకు సందేశమిచ్చారు.మోదీ ప్రభుత్వం ఎంత మాత్రం ఇవ్వవలసిన వాటా ప్రయోజనాలను తిరస్కరించినందున వాటిని సాధించేందుకు పేదలు, దళితులు, శ్రామిక జనులకు ఎన్నికలే తగిన సాధనమని ఇండియా కూటమి పిలుపునిచ్చింది. ఓబీసీలలో ప్రధాన భాగమైన దళితులు, శ్రామికులు, యాదవులు, ఇతర తరగతుల ప్రజలు కలుసుకుని అండగా నిలవాలని లాలూప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్ పిలుపునిచ్చారు. ఒక రోజు ముందు ఔరంగాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ ఆర్‌జేడీ, కాంగ్రెస్ అవినీతిని పెంచిపోషించాయనీ, వంశపారంపర్యపాలన సాగించాయని ఆరోపించారు. ఓబీసీలలో ప్రధాన తరగతి ప్రజలైన యాదవులను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు దూషించడమేకాక, దళితులను హింసించారని, వారిని

దోచుకున్నారని విమర్శించారు. నితీశ్‌కుమార్ వైపు మహా దళితులు ఉన్నారని వీరిని బీజేపీ వైపు మళ్లించకుండా నిరోధించేందుకు లాలూ, తేజస్వియాదవ్ గట్టిగా ప్రయత్నించారు. మహాదళితులు మోదీ వెనుక ఉన్నప్పటికీ వీరు బీజేపీచెంత చేరబోరనీ, చేరకుండా అన్ని చర్యలు తీసుకున్నామని లాలూ, తేజస్వియాదవ్‌లు చెప్పారు. దళితులకు, మహా దళితులకు అభివృద్ధి జరగకుండా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు. దళితులకు ప్రాతినిధ్యంగా ఉన్న చిరాగ్ పాశ్వాన్ తాను రాముడినని చెప్పుకునే మోదీ భక్తుడు జిపిన్ రామ్ మాంఝి బెగుసరాయ్, ఔరంగాబాద్‌లలో మోదీతోపాటు సభల్లో పాల్గొన్నారు. అయితే వీరిద్దరూ నితీశ్‌కుమార్‌ను వ్యతిరేకిస్తున్నారు. అంతేకాదు, వీరు ఇండియాకూటమిలో చేరేందుకు సిద్ధమయ్యారు. చిరాగ్‌ను బుజ్జగించేందుకు అన్ని విధాలా ప్రయత్నించి విఫలమయ్యారు. నితీశ్‌కుమార్ 15రోజులుగా బ్రిటన్‌లో వైద్యచికిత్స పొందుతున్నారని కూడా తేజస్వి వెల్లడిస్తూ తమ పర్యటనలో దళితుల చెంతకు చేరి ఇండియాకూటమిని గెలిపించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు. అరెస్టు తీవ్రతను గ్రహించడంతోపాటు మోదీ, అమిత్‌షా లాలూ, తేజస్వి కేవలం యాదవ నాయకులేనని, జనాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. తేజస్వి మాట్లాడుతూ, మా పార్టీ ముస్లింలు, యాదవుల పార్టీఅని కొంతమంది చెబుతున్నారు. అయితే మాది బహుజనుల, మహిళల, పేదల పార్టీ అన్ని ఎక్కువమంది భావిస్తున్నారన్నారు. నితీశ్‌కుమార్ రహస్యంగా నాటకం ఆడారన్నారు. నితీశ్‌కుమార్ మద్దతు ఉన్నప్పటికీ 2024 ఎన్నికల్లో బీజేపీ రెండంకెల సంఖ్యనుదాటి విజయం పొందలేదని అన్నారు. 17నెలల పాలనలో తాను చొరవ తీసుకుని లక్షల ఉద్యోగాలు కల్పించానని తేజస్వి చెప్పారు. తేజస్విని ఉద్దేశించి, మీ బాబాయి (నితీశ్) ఊగిసలాటలో ఉన్నారని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖడ్గే అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించివేసేందుకు రానున్న ఎన్నికల్లో సిద్ధంగా ఉండాలని నైతికంగా ప్రోత్సహించేందుకు తాను అన్నివిధాలుగా సహకరిస్తానని ఖడ్గే అనారు. నరేంద్ర మోదీకి కుటుంబం ఎక్కడుంది? రామాలయాన్ని గురించి గొప్పగా ఎందుకు చెప్పుకుంటున్నారు? నిజంగా ఆయన హిందువుకాదు. హిందూ సంప్రదాయంలో తల్లిదండ్రులు చనిపోయినప్పుడు తల, గడ్డము, క్షవరము చేయించుకోవాలి. తల్లి చనిపోయినప్పుడు మోదీ ఆ పని చేయలేదు అని ఖడ్గే అన్నారు. బహిరంగ సభలో ముఖ్యంగా యువజనులు ఎక్కువగా పాల్గొన్నారు. వామపక్షాల శ్రేణులు భారీగా ఎర్రజెండాలను చేబూని ప్రదర్శనగా వచ్చి సభలో పాల్గొన్నాయి. తేజస్వితోపాటు రాహుల్‌గాంధీ కూడా యాత్రలో పాల్గొన్నారు. ఇండియా కూటమి నుంచి నితీశ్ వైదొలగిన తర్వాత తక్కిన అన్ని కూటమి రాజకీయ పార్టీలు, పార్టీల కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం అగ్నివీర్ పథకం పేరుతో ఇచ్చిన తాత్కాలిక ఉద్యోగాలను తాము అధికారానికి వస్తే రద్దుచేసి శాశ్వత ఉద్యోగాలను కలిపిస్తామని రాహుల్ ప్రకటించారు. అగ్నివీర్‌లాంటి తాత్కాలిక ఉద్యోగాల గురించి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా లాగే బీహార్‌లో ఏరోజు ఆలోచించలేదని, శాశ్వత ఉద్యోగాల గురించి ఆలోచించి నియమించారని రాహుల్ అన్నారు.

ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోదీ, షా రాహుల్ గాంధీని విమర్శిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస రిటైల్ ధర రావటానికి వీలుగా చట్టం చేయాలని జైరాం రమేశ్ లేదా శ్యాం పిట్రోడా రాహుల్‌కి చెప్పిఉండవచ్చు. ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌ని ముందుగానే ప్రకటించి ఉండాలికదా అని మోదీ షా ఎగతాళి చేస్తున్నారు. ఎన్నికలు అయిన తర్వాతనే ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిని ప్రకటిస్తామని కూటమిలో పార్టీలు చెప్పాయి. అయినప్పటికీ పదేపదే ఈ అంశాలను మోదీ,షా ప్రస్తావిస్తుంటారు. 2024లో జరిగే ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ విచ్ఛిన్నకర రాజకీయాలను అనుసరిస్తున్నదని వాటిని అణచివేసేందుకు ఇండియా కూటమి నాయకులు పాట్నాలో జరిగిని ర్యాలీల వంటి మరిన్ని ర్యాలీలు నిర్వహించాలని సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా సూచించారు. సమాజ్‌వాది పార్టీ నాయకులు అఖిలేశ్ యాదవ్ బీజేపీ నాయకుల తప్పుడు విధానాలను తీవ్రంగా విమ ర్శించారు. ప్రతి రాష్ట్రంలోనూ జరిగే సభలకు ఇండియా కూటమి నుంచి ఉన్నతస్థాయి నాయకులు హాజరు కావాలని అఖిలేశ్ కోరారు. పాట్నాలో జరిగిన ఇలాంటి భారీ ర్యాలీని మరోచోట నిర్వహించడానికి సిద్ధం కావాలని రాహుల్ సూచించారు. బీహార్‌లో ఇండియా కూటమికి ఉన్న బలమైన పరిస్థితి మరిన్ని రాష్ట్రాలవైపు పయనిస్తోందని రాహుల్ అన్నారు.

కుల జన గణన దోపిడీకి అడ్డుకట్ట

ఎం. సురేష్ బాబు

ఎన్నికలు దగ్గర పడుతున్నాయి, తిరిగి అధికారంలోకి రావడానికి అధికార పార్టీలు పావులు కదుపుతున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలలో బీసీ కుల గణన జరగాల్సిందేనని బీసీ ఉద్యమకారులు, దళిత ప్రజాతంత్ర వాదులు, వామపక్షాలు, మేధావులు డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోక పోవడం విచారకరం. కుల గణన అనేది జరిగితే ఎవరు ఎంత శాతం ఉన్నారో తెలుస్తుంది. కులగణన చేపట్టక కేవలం ఎనిమిది శాతం ఉన్న ఆర్థికంగా వెనుకబడిన వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడం వలన వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. జనాభాలో 54 శాతం ఉన్న వెనుకబడిన తరగతులకు కేవలం 27 శాతం రిజర్వేషన్ కల్పించారు. దానితో అన్ని రంగాల్లో వెనుకబడిపోయారు. చట్టసభల్లోనే కాదు గ్రామ, మండల స్థాయి ప్రాతినిధ్యం లేని కులాలు అరవై శాతం వెనుకబడిన తరగతులలో ఉన్నాయి. బీసీ కుల గణన చేపట్టకుంటే కేంద్రంలోని బీజేపీ సర్కారుతో తాడోపేడో తేల్చుకోవాల్సివుంటుందని మేధావులు హెచ్చరిస్తున్నారు. బీజేపీ సర్కార్ ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లు వేయబోమని స్పష్టంచేశారు. రిజర్వేషన్లను ఎత్తేసేలా కేంద్రం వైఖరి ఉంది. బీసీ కుల గణనకు చట్టం అనుమతిస్తుందని కోర్టులు కూడా చెప్తున్నాయి, బీసీ జనాభా లెక్కలు లేకుండా దేశంలోని కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు బడ్జెట్ కేటాయింపులు ఎలా చేస్తారు. 'కులాల లెక్కలు తేల్చితే విద్యావంతులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు ఎంతమంది ఉన్నారో తేలుతుంది. దేశ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం కూడా తెలుస్తుంది. కుల గణన జరిగితే రిజర్వేషన్లు పెంచాలని బీసీల నుంచి డిమాండ్ వస్తుందన్న ఉద్దేశంతోనే కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆ పని చేయడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజల దురదృష్టం ఏమంటే ప్రతిపక్షం, అధికార పార్టీలు బీజేపీతో అంటకాగి తిరుగుతున్నాయి. గతంలో ఈడీ, బ్యాంకులను ముంచడంలో ప్రధాన పాత్ర పోషించిన తెలుగుదేశం నాయకులు బీజేపీలో చేరి పునీతులయ్యారు. పన్నెండు సంవత్సరాల క్రిందట జన్‌లోక్‌పాల్ బిల్లు పెట్టడానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రధాన భూమిక పోషించిన గాంధేయవాది అన్నా హజారే ప్రియ శిష్యులను నేడు మద్యం కుంభకోణంలో ఇరికించారు. సామాన్య మదుపరుల ఆస్తులు లక్షల కోట్లు ఆవిరవుతున్నా, ఎల్‌ఐసి, బ్యాంకింగ్ రంగం కుదేలవుతున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ప్రతిపక్షాలు పట్టుబట్టినా ప్రభుత్వంలో చలనం లేదు. దేశంలో కుల గణన చేపట్టకుండా, సామాజిక సమగ్రత లేకుండా, మహిళలపై, ముస్లింలపై, రైతులపై, కార్మికులపై దాడులు జరుపుతున్న బీజేపీ ప్రభుత్వంపై నోరుమెదపని నాయకులను ఏమనాలి. జాతీయ ప్రయోజనాలు మరుగుపడినచోట ఉత్పాతాలే మిగులుతాయి. పాఠం నేర్వకపోతే ఏ దేశమైనా మునగక తప్పదు. మన దేశంలో ఆర్థిక వృద్ధి అంచనాలు గత రెండు సంవత్సరాలుగా పేలవంగా ఉన్నాయి ఉద్యోగాలు సృష్టించటమనేది ప్రభుత్వానికి ఎదురయ్యే అతి పెద్ద అవరోధంగా ఉంది. జనాభా రీత్యా ప్రపంచంలో అతిపెద్ద దేశంగా భారతదేశం తన యువ కార్మిక శక్తిని ఇముడ్చు కోవాలంటే ఏటా 1.30 కోట్ల ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంటుంది. అయితే 2016 నవంబర్‌లో చేసిన నోట్ల రద్దు దెబ్బకు కుదేలైన చిన్న వ్యాపారులు జీఎస్టీ అమలుతో మరోసారి గట్టి దెబ్బతిన్నారు. వాటిలో చాలా వ్యాపారాలు మూతపడ్డాయి. ఫలితంగా లక్షలాది మంది, ప్రత్యేకించి అసంఘటిత రంగంలో వారు ఉద్యోగాలు కోల్పోయారు. దేశంలో వ్యవసాయం, నిర్మాణరంగం, చిన్న పరిశ్రమలు అతిపెద్ద ఉద్యోగ రంగాలు. ఎందుకంటే కార్మిక శక్తి ఎక్కువ అవసరమైన రంగాలవి. కానీ ఈ మూడు రంగాలూ ఇటీవలి సంవత్సరాలలో ఉద్యోగాలు సృష్టించలేకపోతున్నాయి. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వృత్తిదారుల బతుకులు ఉన్నత స్థితికి చేరాల్సిందిపోయి, నీచ స్థితికి చేరడం మొదలయింది.

ప్రజలంతా వారి కుల లెక్కలు తీయాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోంది. రూపాయి ఖర్చు లేకుండా కుల గణన చేసే అవకాశం ఉన్నా ఎందుకు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. బీసీ జనాభా లెక్కలు బయటకు వస్తే దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. అందుకే లెక్కలు బయటకు రాకుండా ఆ వర్గాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. 'అందరూ సమిష్టిగా కేంద్రం మెడలు వంచాలి. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి. బీసీల పోరాటానికి జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలు అండగా నిలవాలి. దేశంలో ఓబీసీల్లో 983 కులాలకు ఐదేళ్లుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రయోజనాలు అందట్లేదు. ప్రధాని మోదీ నేతృత్వంలో చేతగాని పాలన సాగుతోంది, వ్యవస్థలన్నీ పతనమై పోయాయి, నిరుద్యోగం 8.4 శాతం పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు దివాళా తీసేలా చేస్తున్నారు. ఇన్సూరెన్స్, రైల్వే, కమ్యూనికేషన్, చివరికి ఇస్రో, హెచ్‌ఏఎల్ ప్రైవేటు పరం చేస్తున్నారు. ఆయన ఏదో చేస్తున్నారన్న భ్రమ నుంచి ప్రజలు బయట పడాలి. బీసీల్లోని అన్ని కులాలు ఏకతాటిపైకి వచ్చి రాజకీయంగా బలపడాలి. దేశ జనాభాలో 54శాతం బీసీలే ఉన్నప్పటికీ రాజకీయాల్లో మాత్రం రిజర్వేషన్లు ఇవ్వకపోవడం బాధాకరం. కులాల లెక్కలు తీయకపోతే బీజేపీ గద్దె దిగి పోవాల్సిందే. ఇప్పటివరకు వారి వాటాతో పాటు బీసీలకు వచ్చే వాటా కూడా అనుభవిస్తున్నారు. కులం పేరుతో వివక్షకు

గురైన వర్గాల వారికి సమ ప్రాతినిధ్యం దక్కించడం కోసమే రిజర్వేషన్ల వ్యవస్థ" అని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(4), 16(4) లో స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్థిక ప్రాతిపదికన ఇవ్వాల్సినవి సంక్షేమ పథకాలు మాత్రమేనని, ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఈబీసీ వర్గాలకు ఎక్కడ నుంచి వచ్చాయి. రిజర్వేషన్ కు ప్రాతిపదిక కులం (సామాజిక వెనుకబాటు) మాత్రమే, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతా తారుమారు అవుతోంది. మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ఓబీసీల జనాభా 54% , అగ్రకులాల జనాభా ఎంత అనేది తెలియకుండా వారికి 10 శాతం రిజర్వేషన్లా? అసలు ఏ లెక్కల ప్రకారం 10% కేటాయించారు అనే దానిపై చర్చ జరిగినట్లు లేదు. తీర్పు వెలువరించే ముందు ఓసీ జనాభా లెక్కలను సుప్రీం శాస్త్రీయంగా పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. రిజర్వేషన్లు 50% దాటొచ్చు అన్న సుప్రీం తీర్పును వెనుకబడిన తరగతులు అనుకూలంగా మలచుకుని జనాభా దామాషా ప్రకారం ఓబీసీ లకు 54%రిజర్వేషన్ల కోసం పోరాడాలి. సమగ్రంగా, శాస్త్రీయంగా అన్ని కులాల లెక్కలు తీయాలి, వేరే అంశాలు పక్కన పెట్టి జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలి. అన్ని సామాజిక, రాజకీయ శక్తులు,

సార్వత్రిక ఎన్నికల్లో, బీజేపీ అధికారంలోకి రాకుండా నిరోధించడానికి తీవ్రంగా కృషి చేయాలి. భారతదేశాన్ని ఒక మతతత్వ రాజ్యంగా మార్చే ఆరెస్సెస్ అజెండాను తిప్పికొట్టేందుకు లౌకిక ప్రజాతంత్ర శక్తులు చర్యలు తీసుకోవాలి. ఫాసిజం, నియంతృత్వం మధ్య గుణాత్మక వ్యత్యాసం మసకబారుతోంది. ఫాసిజం కూడా నియంతృత్వమే, కానీ ప్రతి నియంతృత్వం ఫాసిజం కాదు. ఫాసిజం సమాజంలో కొన్ని విభాగాలను మైనారిటీ వర్గాలు 'ఇతరులు'గా ప్రదర్శిస్తుంది. ఇది మైనారిటీలను 'మెజారిటీ ప్రజలకు' శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది దేశ అభివృద్ధికి అవరోధాలుగా, దేశ భద్రతకు ముప్పుగా చూపుతోంది.' ఫాసిస్ట్ శక్తులు మైనారిటీలకు వ్యతిరేకంగా మెజారిటీ ప్రజానీకాన్ని సమీకరించి జాతి ప్రక్షాళన వరకు కూడా వెళ్తాయి. ఈ దేశ మూలవాసుల సంస్కృతి, ఆర్థిక శక్తిని ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపినప్పుడే బహుజనులు బాగుపడతారు. దళితులు, దళితేతరుల మధ్య వైషమ్యాలు పెంచి పోషిస్తున్న హైందవ పార్టీల ఆటకట్టించాలి. వెనుకబడిన తరగతులు, ఎస్సీ , ఎస్టీ, మైనారిటీతో కలిసి ప్రాతినిధ్యం లేని కులాలు సంఘటితమై ముందుకు నడవాలి. సీట్లు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి రావాలి.

అధ్యక్షులు, గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య

మోదీ సర్కారుకు ఎస్బీఐ రక్ష

- అక్రమ లావాదేవీలు దాచేందుకు బీజేపీ కుట్ర
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్ర విమర్శలు
- ఎన్నికల బాండ్ల వివరాల వెల్లడిలో జాప్యంపై అనుమానం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు రహస్యంగా విరాళాలందించే ఎన్నికల బాండ్ల విషయంలో కేంద్రంలోని మోదీ సర్కారుపై కాంగ్రెస్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. ఎన్నికల బాండ్ల ద్వారా పార్టీలకు అందిన విరాళాల వివరాలు ఎన్నికల సంఘానికి(ఈసీ) అందించడంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) చేస్తున్న జాప్యానికి మోదీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఎన్నికల బాండ్ల ద్వారా జరిపిన అక్రమ లావాదేవీలను దాచిపెట్టేందుకే జాతీయ బ్యాంకును మోదీ ప్రభుత్వం రక్షణ కవచంలా వాడుకుంటోందని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల తర్వాతే తమ వివరాలు బయటకు రావాలని బీజేపీ కోరుకుంటోందని, అందుకే జూన్ నెలాఖరు వరకు గడువు కావాలని ఎస్‌బీఐ కోరిందని ఖర్గే పేర్కొన్నారు. 'లోక్‌సభ ఎన్నికల తర్వాత దీన్ని పూర్తి చేయాలని బీజేపీ కోరుకుంటోంది. ఈ లోక్‌సభ పదవీకాలం జూన్ 16తో ముగుస్తుంది. ఎస్బీఐ జూన్ 30 నాటికి డేటాను పంచుకోవాలనుకుంటోంది. ఈ మోసపూరిత పథకం వల్ల బీజేపీయే ప్రధాన లబ్ధిదారుడు' అని ఖర్గే అన్నారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కాలం జూన్ 16తో ముగుస్తుందనగా... బాండ్ల వివరాలు వెల్లడించేందుకు ఎస్బీఐ జూన్ 30దాకా గడువు కోరడమేంటని ఖర్గే సూటిగా ప్రశ్నించారు. దీని వెనుక కాషాయ పార్టీ కుట్ర స్పష్టమవుతోందన్నారు. ఈ అపారదర్శక ఎన్నికల బాండ్లకు బదులుగా హైవేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, పవర్ ప్లాంట్లు తదితర కాంట్రాక్టులను మోదీ సన్నిహితులకు అప్పగించడాన్ని బీజేపీ ప్రభుత్వం సౌకర్యవంతంగా దాచిపెట్టడం లేదా? అని ఖర్గే ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం ఎస్బీఐని అడ్డం పెట్టుకుని సుప్రీం తీర్పును బుల్డోజ్ చేయడానికి యత్నిస్తోందని ఖర్గే విమర్శించారు. ఎన్నికల బాండ్ల ద్వారా అత్యధికంగా అక్రమ లావాదేవీలు జరిపింది బీజేపీయేనన్నారు. మార్చి 6వ తేదీకల్లా ఎన్నికల సంఘానికి బాండ్ల వివరాలందించాల్సిన ఎస్బీఐ తుది గడువును జూన్ 30 దాకా పొడిగించాలని తాజాగా సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. నిజానికి ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలందించిన 44వేల434 కంపెనీలు, వ్యక్తుల వివరాలను సిద్ధం చేయడానికి 24 గంటల కంటే ఎస్బీఐకి ఎక్కువ సమయం పట్టదని నిపుణులు వాదిస్తుండటం గమనార్హం. కాగా ఎస్బీఐ పార్టీల పేరు మీద విడుదల చేసే ఎన్నికల బాండ్లను కంపెనీలు, వ్యక్తులు కొనుక్కుంటే రాజకీయ పార్టీల ఖాతాల్లో ఆ నిధులు జమవుతాయి. ఎవరు బాండ్లు కొనుగోలు చేస్తారనేది రహస్యంగా ఉంచుతారు. అయితే ఈ పథకంలో పారదర్శకత లేదని దాఖలైన పిల్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని... వాటి వివరాలను ఎన్నికల సంఘానికి వెంటనే అందించాలని ఎస్బీఐని ఆదేశించింది.

బెంగాల్‌లో తృణమూల్‌దే అధికారం: మమత

కోల్‌కతా: ఎన్నికలు రావొచ్చు పోవచ్చు కానీ పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మాత్రం అధికారాన్ని కొనసాగిస్తుందని... ఆ పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. తూర్పు మేదినీపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మమతా బెనర్జీ మాట్లాడుతూ... ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు నినాదాలు చేసే వారు కూడా రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ తప్పకుండా అధికారంలో కొనసాగుతుందని గుర్తుంచుకోవాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటూ... ఎన్నికల సమయంలో ఢిల్లీ నుంచి కొందరు వస్తుంటారని... ఎన్నికలైన తరువాత మళ్లీ కన్పించరని, ఎవరైనా చనిపోయినా కూడా రారని తెలిపారు. కాగా లోక్‌సభ ఎన్నికలకు ముందు తృణమూల్ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు రాయ్ ఆదివారం తన పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో తనకు గౌరవం లేదని భావించి రాజీనామా చేసినట్లు రాయ్ స్పష్టం చేశారు.

యూపీ పోలీస్ నియామక అధికారి తొలగింపు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ పేపర్ లీకేజీ కేసులో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. యూపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ బోర్డు చైర్‌పర్సన్ రేణుకా మిశ్రాను ఆ పదవి నుంచి తొలగించారు. ప్రస్తుతం ఆమెను వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచారు. విజిలెన్స్ డైరెక్టర్ రాజీవ్ కృష్ణకు బోర్డు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి గత ఫిబ్రవరి 17,18 తేదీల్లో పరీక్షలు నిర్వహించారు. అయితే, పేపర్ లీకేజీ ఆరోపణలు వెల్లువెత్తడంతో అదే నెల 24న పరీక్షలను రద్దు చేస్తున్నట్టు యోగి సర్కార్ ప్రకటించింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించడంతో పాటు ఆరు నెలల్లోగా తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. పేపరు లీకేజీ ఆరోపణలపై దర్యాప్తు బాధ్యతను స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)కు అప్పగిస్తామన్నారు. యూపీ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 48 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు.

పాక్ అనుకూల నినాదాలు... ముగ్గురి అరెస్ట్

బెంగళూరు: కర్ణాటక విధాన సౌధలో పాకిస్థాన్ జిందాబాద్ అని నినదించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీకి చెందిన ఇల్తాజ్, బెంగళూర్‌కు చెందిన మునావర్, హావేరికి చెందిన మహ్మద్ షఫీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని బెంగళూరు కోర్టులో ప్రవేశపెట్టగా మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి ఇచ్చారు. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడిగా సయ్యద్ నజీర్ హుస్సేన్ విజయం సాధించారు. దాంతో అసెంబ్లీ ఎదుట సెలబ్రేషన్స్ నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ జై కాంగ్రెస్ అని నినాదాలు చేశారు. అంతలో కొందరు పాకిస్థాన్ జిందాబాద్ అని నినదించారు. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఘటనపై విధాన సౌధ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతం నుంచి వీడియో ఫుటేజీ తీశారు. దానిని ఫోరెన్సిక్ బృందానికి పంపించారు. ఘటన జరిగిన ప్రాంతంలో ఆధారాలను పోలీసులు సేకరించారు. తర్వాత ప్రత్యక్ష సాక్షుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. వీడియో ఆధారంగా ఫోరెన్సిక్ నివేదిక వచ్చింది. ఇల్తాజ్, మునావర్, మహ్మద్ షఫీ పాకిస్థాన్ జిందాబాద్ అన్నారని నిర్ధారించారు. పాకిస్థాన్ జిందాబాద్ అని ముగ్గురు రెండుసార్లు నినదించారు. స్లోగన్స్ ఇచ్చిన వారి పేర్లను ఫోరెన్సిక్ బృందం పేర్కొనలేదు. ఫోరెన్సిక్ బృందానికి ఇచ్చిన వీడియో ప్రామాణికమైంది. ఫోరెన్సిక్ నిపుణుల నివేదిక ప్రకారం ఆ ముగ్గురు నినదించారు. నివేదిక ఆధారంగా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు అని' కర్ణాటక హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర వెల్లడించారు.

దేశవ్యాప్తంగా 17చోట్ల ఎన్ఐఏ సోదాలు



న్యూఢిల్లీ: ఉగ్ర కుట్ర కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ దేశవ్యాప్తంగా 17 ప్రదేశాల్లో ఏకకాలంలో సోదాలు చేసింది. అనుమానితులకు సంబంధించిన ప్రదేశాలున్న తమిళనాడు, కర్ణాటక సహా మరో ఏడు రాష్ట్రాల్లో ఈ సోదాలు జరుగుతున్నాయి. లష్కరే తోయిబాకు చెందిన ఓ ఉగ్రవాది బెంగళూరు పరప్పన అగ్రహార జైల్లోని ఖైదీలకు ఉగ్రవాద భావజాలం బోధిస్తున్నట్టు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు చేపట్టినట్లు తెలిసింది. 2023 జులైలో ఓ ఇంట్లో సమావేశమైన ఐదుగురు వ్యక్తులను బెంగళూరు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరందరూ లష్కరే తోయిబా ఉగ్రవాది నజీర్ భావజాలంతో ప్రభావితమైనవారిగా గుర్తించారు. అప్పట్లో నిందితుల నుంచి మందుగుండు, ఆయుధాలు, గ్రనేడ్లు, వాకీటాకీలు స్వాధీనం చేసుకొన్నారు. దీంతో కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు బదిలీ చేశారు. నజీర్ ప్రస్తుతం జీవితఖైదు అనుభవిస్తున్నాడు. గతేడాది కూడా జాతీయ దర్యాప్తు సంస్థ తనిఖీలు నిర్వహించింది. కాగా కొద్ది రోజుల క్రితం బెంగళూరు రామేశ్వరం కేఫ్ లో పేలుడు ఘటన జరిగింది. ఆ కేసును కూడా సోమవారం ఎన్ఐఏకి అప్పగించారు. ఆ తర్వాతి రోజే 2023 నాటి ఉగ్ర కుట్ర కేసుకు సంబంధించిన తనిఖీలు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో భారీ బాంబు పేలుళ్లకు ఇస్లామిక్ స్టేట్ ఉగ్ర సంస్థ పన్నిన కుట్రను కొన్నాళ్ల క్రితం ఎన్ఐఏ భగ్నం చేసిన సంగతి విదితమే. నాలుగు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించిన ఎన్ఐఏ ఉగ్ర ముఠాకు చెందిన 8 మందిని అరెస్టు చేసింది. భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలకు సంబంధించిన ముడి సరకు, ఉగ్ర కుట్రకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకుంది.

సిద్ధరామయ్య, మంత్రులకు బాంబు బెదిరింపులు

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతోసహా కొంతమంది మంత్రులకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. మంగళవారం ఈమెయిల్ ద్వారా బెదిరింపు వచ్చినట్లు అధికారులు తెలిపారు. బెదిరింపు మెయిల్ అందుకున్న వారిలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హోంమంత్రి జీ పరమేశ్వరతోపాటు కొంతమంది ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. తమకు 2.5 మిలియన్ డాలర్లు(దాదాపు రూ. 20 కోట్లు) ఇవ్వకపోతే కర్నాటక వ్యాప్తంగా బస్సులు, రైళ్లు దేవాలయాలు, హోటళ్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున పేలుళ్లు జరుపుతామని హెచ్చరించారు. దీనిపై బెంగళూరు సిటీ క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాంబు నిర్వీర్య బృందాలతో పాటు పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు.

'సినిమా ట్రైలర్‌పై మీ అభిప్రాయం ఏమిటి? మీరు మాకు 2.5 మిలియన్ డాలర్లు అందించకపోతే, కర్నాటక అంతటా బస్సులు, రైళ్లు, దేవాలయాలు, హోటళ్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో పెద్ద పేలుళ్లు జరుపుతాము. మేము మీకు మరో ట్రైలర్ చూపించాలనుకుంటున్నాము. అంబారీ ఉత్సవ్ బస్సులో బాంబును పేల్చబోతున్నాం. అంబారీ ఉత్సవ్ బస్సు పేలుడు తర్వాత, మా డిమాండ్లను సోషల్ మీడియాలో లేవనెత్తుతాము. మీకు పంపిన మెయిల్ స్క్రీన్‌షాట్‌లను అప్‌లోడ్ చేస్తాం. మా తదుపరి పేలుడు గురించి త్వరలోనే ట్వీట్ చేస్తాం' అని మెయిల్‌లో పేర్కొన్నారు.

షాజహాన్ షేక్‌ను సీబీఐకి అప్పగించండి

బెంగాల్ పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖలీ లో ఇటీవల ఈడీ అధికారులపై జరిగిన దాడి కేసును కలకత్తా హైకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు బదిలీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నాయకుడు షాజహాన్ షేక్ ను కూడా సీబీఐ కస్టడీకి అప్పగించాలని బెంగాల్ పోలీసులను కోర్టు ఆదేశించింది. 'రేషన్ బియ్యం కుంభకోణం' కేసులో నిందితుడిగా ఉన్న షాజహాన్ షేక్ ఇంట్లో తనిఖీల కోసం వెళ్లిన ఈడీ బృందంపై ఆయన అనుచరులు జనవరి 5న దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ఆయన కనిపించకుండా పోయారు. ఈ క్రమంలో షాజహాన్‌పై అత్యాచార ఆరోపణలు చేస్తూ సందేశ్‌ఖలీ మహిళలు చేసిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఈ కేసును హైకోర్టు తీవ్రంగా పరిగణించడంతో చివరకు ఫిబ్రవరి 29న షేక్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. అయితే ఈడీ అధికారులపై షాజహాన్ అనుచరులు జరిపిన దాడి కేసులో దర్యాప్తు నిమిత్తం సీబీఐ, రాష్ట్ర పోలీసులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేయాలని హైకోర్టు జనవరి 17న తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఈడీ, బెంగాల్ ప్రభుత్వం విడివిడిగా పిటిషన్లు దాఖలు చేశాయి. దర్యాప్తును పూర్తిగా సీబీఐకి అప్పగించాలని ఈడీ కోరగా... రాష్ట్ర పోలీసులకే ఇవ్వాలని తృణమూల్ సర్కారు అభ్యర్థించింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన కలకత్తా హైకోర్టు.. దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

నీరు వృథా చేస్తే రూ.5 వేల జరిమానా!

బెంగళూరు: వేసవి పూర్తిస్థాయిలో రాకముందే బెంగళూరు ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. నగరంలోని యల్హంక, కనకపుర, వైట్‌ఫీల్డ్ ప్రాంతాల్లో నివసించే వారిని ఈ సమస్య తీవ్రంగా వెంటాడుతోంది. ఈక్రమంలో నీటి వృథాను కట్టడి చేసేందుకు బెంగళూరులోని ఓ హౌసింగ్ సొసైటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో నివసించే వారిలో ఎవరైనా నీరు ఎక్కువగా ఉపయోగిస్తే వారికి రూ.5 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించింది. దీనిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా భద్రతా సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపింది. "గత నాలుగు రోజులుగా బెంగళూరు నగరపాలక సంస్థ వాటర్ బోర్డు నుంచి నీరు రావడం లేదు. ప్రస్తుతం బోర్ల ద్వారా నీరు అందిస్తున్నాం. హౌసింగ్ సొసైటీలో నివసించేవారు నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించాలని కోరుతున్నాం. దీనివల్ల వేసవిలో ఎక్కువ రోజులు నీరు వినియోగించుకోవచ్చు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనను అతిక్రమిస్తే వారికి రూ. 5వేలు జరిమానా విధిస్తాం. ప్రత్యేకంగా నియమించిన భద్రతా సిబ్బంది నీటి వినియోగాన్ని పర్యవేక్షిస్తారు" అని వైట్‌ఫీల్డ్‌లోని పామ్ మిడోస్ హౌసింగ్ సొసైటీ గృహసముదాయాల్లోని వారికి జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. ఇందులోభాగంగా నగరంలోని ట్యాంకర్ల యజమానులు ఈ నెల ఏడు నాటికే తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద వివరాలు నమోదు చేయాలని ఆదేశించింది. మరోవైపు నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రూ.556 కోట్లు మంజూరుచేసినట్లు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. నగరంలోని ప్రజల కోసం తమవంతుగా రూ.10 కోట్లు ఇవ్వాలని నియోజకవర్గ ఎమ్మెల్యేలను ఆయన కోరారు. ఖాళీ పాల ట్యాంకులను నీటి నిల్వకు, సరఫరా కోసం ఉపయోగించనున్నట్లు తెలిపారు.

త్వరలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్?

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ 15 నుంచి 20 రోజుల్లో రాబోతుందని తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ గురించి జమ్ముకశ్మీర్ ఎన్నికల అధికారి పీకే పోల్ హింట్ ఇచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని సీనియర్ అధికారులు అంచనా వేస్తున్నారని వివరించారు. ఎన్నికలకు ముందు గల పరిస్థితులను పరిశీలిస్తున్నారని వెల్లడించారు.'అనంత్ నాగ్, కుల్గమ్, సోఫియా జిల్లా అధికారులను కలిశాను. గత ఎన్నికల కంటే మెరుగ్గా ఎన్నికలు నిర్వహించాలని సూచించాను. శాంతియుతంగా, పారదర్శకంగా, నిష్పాక్షపాతంగా ఎన్నికలు జరగాలని ఆదేశించాను. ఈ నెల 13వ తేదీ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఆ లోపు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనులు పూర్తి కావాలని స్పష్టం చేశాను. లోక్‌సభ ఎన్నికల్లో 97 కోట్ల మంది ఓటర్లు ఓటు వేస్తారు. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు ఉంటాయి. లోక్‌సభ ఎన్నికలతో అసెంబ్లీ ఎన్నికల తేదీలను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించనుంది అని' జమ్ము కశ్మీర్ ఎన్నికల అధికారి పీకే పోల్ వెల్లడించారు.

భారత పౌరులు మంచివారేనన్న స్పెయిన్ బాధితురాలు

రాంచీ: భారత్‌లో పర్యటిస్తున్న స్పెయిన్‌కు చెందిన ఓ మహిళపై జార్ఖండ్‌లో సామూహిక అత్యాచారం జరగడం దేశవ్యాప్తంగా సంచలనం రేపడంతో పాటు ప్రపంచ దేశాల నుంచి భారత్‌పై విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా ఈ ఘటనలో బాధిత మహిళ నేపాల్‌కు బయలుదేరే ముందు విలేకరులతో మాట్లాడుతూ... భారత్ ప్రజలపై ఎటువంటి ఫిర్యాదులు లేవని, దాదాపు 20వేల కి.మీ. సురక్షితంగా ప్రయాణించామన్నారు. 'ఆరు నెలలు భారత్‌లో మా పర్యటన కొనసాగింది. 20వేల కి.మీ.లు ప్రయాణించాం. ఎక్కడా సమస్య రాలేదు. భారత్‌లో ఎన్నో మంచి జ్ఞాపకాలున్నాయి. ఇక్కడి పౌరులు ఎంతో మంచివాళ్లు. ప్రజలను కాదు.. నేరస్థులను మాత్రమే నిందిస్తా. ఈ దేశ ప్రజలు చాలా బాగా చూసుకున్నారు' అని పేర్కొన్నారు. అందమైన ప్రదేశం, ప్రశాంతంగా ఉండటంతోనే రాత్రి నిద్రకు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నామని... కానీ చివరకు ఇలా జరిగిందని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలను మరిచిపోరాదు కానీ, గతాన్ని వదిలేసేందుకు ప్రయత్నిస్తూనే ఉండాలని ఆమె అమ్మాయిలకు సూచించారు. బీహార్ మీదుగా నేపాల్ బయలుదేరిన ఆమె... తన భర్తతో కలిసి ప్రపంచయాత్ర కొనసాగిస్తానని ధీమా వ్యక్తంచేశారు. పోలీసులు వేగంగా చర్యలు తీసుకున్నారని బాధితురాలి భర్త పేర్కొన్నారు. బైక్‌పై ప్రపంచ యాత్ర చేస్తోన్న స్పెయిన్ దేశస్థురాలిపై కొద్దిరోజుల క్రితం జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో సామూహిక అత్యాచారం జరిగింది. తన భర్తతో కలిసి ఓ తాత్కాలిక గుడారంలో ఉన్న ఆమెపై స్థానిక యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడటం సంచలనం రేపింది. ఈ దారుణంపై జార్ఖండ్ అసెంబ్లీలో తీవ్ర దుమారం రేగింది. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురి కోసం వెదుకుతున్నారు.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: ఫేస్‌బుక్, మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. మెటా సంస్థకు చెందిన ఈ సర్వీసులు సాంకేతిక సమస్య కారణంగా భారత్ సహా పలు దేశాల్లో స్తంభించడంతో నెటిజన్లు అసహనం వ్యక్తం చేశారు. ఈ సాంకేతిక సాధనాలపై ఆధారపడిన కొన్ని కోట్ల మంది ఎందుకిలా జరిగిందో అర్థంకాక.. నానా హైరానా పడ్డారు. నిత్యజీవితంలో భాగమైన ఈ సర్వీసులకు అంతరాయం ఏర్పడంతో త్వరగా సర్వీసులు పునరుద్ధరించాలని ఇతర మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. తమ ఒక్కరికే ఈ పరిస్థితి వచ్చిందా, అందరికీ ఉందా అని ఆరా తీశారు. ఈ పరిస్థితిపై ఇంకా మెటా సంస్థ స్పందించాల్సి ఉంది.

వ్యోమగాముల సేఫ్ ల్యాండింగ్‌కు 48 బ్యాకప్ సైట్లు

న్యూఢిల్లీ: గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా అంతరిక్షం నుంచి తిరిగి వచ్చే వ్యోమగాముల సేఫ్ ల్యాండింగ్ వేళ ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం లేకుండా ఇస్రో అన్ని ప్రయత్నాలు చేస్తోంది. భారత్ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'. దీనిలో నలుగురు వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్లి మూడు రోజుల తర్వాత భూమి మీదకు వస్తారు. ఈ క్రమంలో వారి సురక్షిత ల్యాండింగ్ కోసం ప్రపంచవ్యాప్తంగా 48 బ్యాకప్ సైట్లను గుర్తించినట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ వెల్లడించింది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. "గగన్‌యాన్ యాత్రలో భాగంగా మా ప్లాన్ ప్రకారం వ్యోమగాములతో కూడిన మాడ్యూల్ అరేబియా సముద్రంలో దిగాల్సి ఉంది. వారిని రక్షించేందుకు సిబ్బంది అక్కడ సిద్ధంగా ఉంటారు. ఈ ప్రణాళికలో ఏ చిన్న మార్పుకైనా సిద్ధంగా ఉండే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. అంతర్జాతీయ జలాల్లో 48 బ్యాకప్ సైట్లను గుర్తించాం" అని ఇస్రో సీనియర్ అధికారిని ఉటంకిస్తూ ఆ కథనాలు పేర్కొన్నాయి. అంతా అనుకున్నట్టే జరిగితే ఆ మాడ్యూల్ భారత జలాల్లో దిగుతుందని తెలిపారు. అంతరిక్షంలోకి వెళ్లిన వ్యోమగాములను తిరిగి తీసుకువచ్చే విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోలేమని, అందుకే ల్యాండింగ్‌కు అవకాశం ఉన్న పాయింట్లను గుర్తించినట్లు తెలిపారు. మిషన్‌లో చిన్నపాటి వేరియేషన్ కూడా వందల కిలోమీటర్ల దూరంలో ల్యాండింగ్ కారణమవుతుందని చెప్పారు. ప్రస్తుతం గగన్‌యాన్ పనుల్లో పురోగతి ఆశాజనకంగా ఉందన్నారు. ఈ ఏడాది కనీసం ఒక్క మానవ రహిత యాత్ర అయినా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉంటే, ఈ యాత్రకు ఎంపికైన వ్యోమగాముల పేర్లను ఇటీవల ప్రధాని మోదీ ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా వ్యోమనౌకలో రోదసీలోకి వెళ్లనున్నారు. భారత నేల నుంచి స్వదేశీ వ్యోమనౌకలో అంతరిక్షంలోకి వెళ్లనున్న మొదటి భారతీయ బృందంగా వీరు ఘనత దక్కించుకోనున్నారు.

ఎమ్మెల్సీగా నితీశ్ నామినేషన్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మరోసారి రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు పోటీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన నామినేషన్ పత్రాలను మంగళవారం ఆయన దాఖలు చేశారు. ఉప ముఖ్యమంత్రులు సమ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, రాజీవ్ సింగ్ లలన్ సహా పలువురు అధికార ఎన్డీయేకు చెందిన సీనియర్ నేతలు నితీశ్‌తో నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. నితీశ్‌కుమార్‌తో పాటు జేడీయూకు చెందిన ఖలీద్ అన్వర్, జితిన్ రామ్ మాంఝీ (హెచ్ఏఎం) కుమారుడు సంతోశ్ సుమన్ సైతం శాసనమండలికి నామినేషన్లు దాఖలు చేశారు. జితిన్ రామ్ మాంఝీ సైతం ఈ నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి హాజరయ్యారు. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి 2006లో శాసన మండలికి ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆయన వరుసగా శాసనమండలికి పోటీ చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఆయన నాలుగోసారి ఎన్నికల బరిలో ఉన్నారు. శాసన మండలికి ఆయన తాజా సభ్యత్వం మేతో ముగియనుంది. ఈ క్రమంలో బీహార్ విధాన పరిషత్‌కు చెందిన 11 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలను ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

బీజేపీ 4 సీట్లలో...

ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న 11 స్థానాల్లో నాలుగు సీట్లు బీజేపీకి కేటాయించగా, భాగస్వామ్య పార్టీ హిందుస్థానీ అవామీ మోర్చాకు ఒక సీటు కేటాయించారు. రెండు స్థానాల్లో జేడీయూ పోటీ చేస్తోంది. ఎన్డీయే కనీసం ఏడు సీట్లలో పోటీ చేస్తోందని, అవసరమైతే మరిన్ని సీట్లలో పోటీ చేస్తుందని ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి తెలిపారు. ఆర్జేడీ, కాంగ్రెస్ నుంచి పలువురు బీజేపీలో చేరవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల గడువు మార్చి 11న ముగియనుండగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు 14వ తేదీతో ముగుస్తుంది. మార్చి 21న ఓటింగ్ జరుగుతుంది.

బీజేపీలోకి మాజీ జడ్జి

కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ బీజేపీలో చేరనున్నారు. బెంగాల్‌లో టీఎంసీ 'అవినీతి'కి వ్యతిరేకంగా పోరాడుతున్న బీజేపీలో చేరుతున్నట్లు ఆయన మంగళవారం నాడిక్కడ ప్రకటించారు. మార్చి 7 మధ్యాహ్నం బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధిష్ఠానం ఏ స్థానాన్ని కేటాయిస్తే అక్కడి నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీయే, తనను రాజకీయాల్లోకి వచ్చేలా చేసిందన్నారు. 'గడచిన రెండేళ్లుగా విద్యా రంగంలోని కొన్ని ముఖ్య కేసులను విచారిస్తున్నాను. ఇందులో భారీ అవినీతి బయటపడింది. ప్రభుత్వంలోని ప్రముఖ వ్యక్తులు సైతం జైలు పాలయ్యారు. నా మనఃసాక్షి ప్రకారమే ఉద్యోగానికి రాజీనామా చేశాను. ప్రజల సంక్షేమం కోసమే రాజకీయాల్లోకి వస్తున్నాను' అన్నారు.

డేటా బయటకు రాకూడదనే...

ఎస్‌బీఐ తీరుపై సుప్రియా శ్రీనటే

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్ల డేటాను బయట పెట్టకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనటే వ్యాఖ్యానించారు. 'ఎస్‌బీఐ అతిపెద్ద రుణదాత, కంప్యూటరైజ్డ్ బ్యాంక్. ఇది 48 కోట్ల బ్యాంక్ ఖాతాలను నిర్వహిస్తోంది. దేశం అంతటా 66,000 ఏటీఎంలు, దదాదాపు 23,000 శాఖలను కలిగివుంది. ఆ బ్యాంకుకు 22,217 ఎలక్టోరల్ బాండ్ల డేటాను ఇవ్వడానికి ఐదు నెలల సమయం పడుతుందా! ఈ సమాచారాన్ని ఒక్క క్లిక్‌లో పొందవచ్చు' అని సుప్రియా శ్రీనటే అన్నారు. 2017 నుంచి 2023 మధ్య బాండ్ల ద్వారా పార్టీలు దాదాపు రూ.12,000 కోట్లు వసూలు చేశాయని, అందులో రూ.6,500 కోట్లు బీజేపీకి వెళ్లాయని చెప్పారు.

ఏ పార్టీకి ఎంత విరాళం ఇస్తున్నారో తెలుసుకునే హక్కు ప్రజలకు లేదా? అని ప్రశ్నించారు. 25 రోజుల తర్వాత మేల్కొన్న ఎస్‌బీఐ అదనపు సమయం కావాలనడం దాతల పేర్లు దాచడానికే అని, బీజేపీతో కుమ్మక్కై ఇలా చేస్తోందని శ్రీనటే ఘాటు విమర్శలు చేశారు.

మోదీ సర్కారు ధోరణి

దేశ మనుగడకు ప్రమాదకరం

భారత జాతీయ మహిళాసమాఖ్య నేత విజయలక్ష్మి

విశాలాంధ్ర-హైదరాబాద్: కేంద్రంలోని మోదీ సర్కారు రాజ్యాంగ సూత్రాలను నిర్వీర్యం చేస్తూ... హింసాత్మక మతతత్వ భావజాలన్ని ప్రోత్సహిస్తోందని... ఈ పరిణామం దేశ మనుగడకు అత్యంత ప్రమాదకరమని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు డా. బీవీ విజయలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కుతూ... వారి గొంతు నొక్కుతూ... కార్మికులు, మైనారిటీలను అణిచివేస్తోందన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్ లో మంగళవారం భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి, తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా ఫోరం సంయుక్తాధ్వర్యంలో 114వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. 'ద్వేషపూరిత రాజకీయాలు తిరస్కరిద్దాం - లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అనే అంశంపై ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం సదాలక్ష్మి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. తొలుత ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ పతాకాన్ని తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి. ప్రేమ్ పావని ఎగురవేశారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ సమాన వేతనాలు, లింగ సమానత్వం, పునరుత్పత్తి హక్కులు, మహిళలపై హింస, దుర్వినియోగం వంటి సమస్యలపై 20వ శతాబ్దం ప్రారంభంలో ఉత్తర అమెరికా , ఐరోపాలో జరిగిన కార్మిక ఉద్యమాల ద్వారా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉద్భవించిందన్నారు. దేశంలో మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీ లపై గత పదేళ్లుగా అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కల్పిస్తున్న రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కోసం ఐక్యంగా బలమైన పోరాటాలు నిర్వహించి కార్పొరేట్-హిందుత్వ బంధంతో నడుస్తున్న క్రూర పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అణగదొక్కే ప్రయత్నం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ ప్రవేశిక నుంచి 'సెక్యులర్ మరియు సోషలిస్ట్' పదాలను ఎందుకు తొలగించిందని ఆమె ప్రశ్నించారు. బీజేపీ భారత రాజ్యాంగాన్ని కూల్చివేసి దాని స్థానంలో హిందూ రాష్ట్రం లేదా హిందూ రాజ్యానికి సంబంధించిన తన దృక్పథాన్ని నెరవేర్చే పత్రాన్ని ప్రతిష్ఠించాలనుకుంటోందని ఆరోపించారు. బీజేపీ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పుగా తయారైందని... రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థి, యువత ఐక్యంగా బీజేపీ ప్రభుత్వ వినాశకర విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. పీ ప్రేమ్ పావని మాట్లాడుతూ... మహిళలు వివక్షకు వ్యతిరేకంగా, లింగ సమానత్వం కోసం ఉద్యమించాలని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయలలో సమానమైన హక్కుల కోసం ఏకం కావాలన్నారు. ఈ సదస్సులో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, బీ జంగమ్మ, సహాయ కార్యదర్శి ఫైమీద, స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులూ డీ కమలారెడ్డి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర నాయకులు పడాల నళిని, రొయ్యల గిరిజ, నీలమ్మ, మంజుల, హైమవతి, మాధవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీట్ల సర్దుబాటుపై

కాంగ్రెస్, సీపీఐ చర్చలు

న్యూదిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలలో ఇండియా కూటమిలో భాగస్వామిగా పోటీచేసే సీట్లపై కాంగ్రెస్, సీపీఐ మధ్య మంగళవారం దిల్లీలో చర్చలు జరిగాయి. ఈ చర్చలలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ పాండా పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికలలో సీపీఐ పోటీచేయాలని భావిస్తున్న సీట్లపై ఈ సందర్భంగా ప్రాథమిక చర్చలు జరిగాయి. ప్రస్తుతం జోడో యాత్రలో ఉన్న పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో కూడా సంప్రదించి సీట్ల సర్దుబాటుపై ఒక అవగాహనకు వద్దామని సీపీఐ నేతలతో ఖడ్గే చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో పొత్తులో భాగంగా ఒక స్థానం సీపీఐకి కేటాయించే అంశంపైనా వారు చర్చించారు. ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణలోని వరంగల్ స్థానం తమకు కేటాయించాలని సీపీఐ నేతలు కోరారు. ఈ విషయమై ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ దృష్టికి తీసుకువచ్చామని, తమకు బలమున్న వరంగల్‌ను తప్పక కేటాయించాలన్నారు.

నాపై కేసుల వివరాలు తెలపండి

డీజీపీకి చంద్రబాబు లేఖ



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నామినేషన్‌లో పొందుపరిచేందుకు తనపై నమోదైన కేసుల వివరాలు ఇవ్వాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డీజీపీ కే రాజేంద్రనాథ్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. 2019 తర్వాత వివిధ జిల్లాల్లో తనపై నమోదైన కేసుల వివరాలు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై అక్రమ కేసులు పెట్టారని, ఈ క్రమంలో 2019 నుంచి నమోదైన కేసుల వివరాలన్నీ తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తమపై నమోదైన కేసుల వివరాలు నామినేషన్ దాఖలు చేసే సమయంలో అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. 'గత ఐదేళ్లలో ప్రభుత్వ విధానాలపై పోరాడుతున్న కారణంగా పోలీసు స్టేషన్లలో, వివిధ ఏజెన్సీల ద్వారా నాపై అనేక అక్రమ కేసులు బనాయించారు... సంబంధిత ఏజెన్సీలు, అధికారులు నాపై పెట్టిన కేసుల విషయంలో సమాచారం ఇవ్వలేదు. ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నేతగా పనిచేస్తున్న నాపై 2019 నుంచి నమోదైన కేసుల వివరాలు తెలియ జేయాలి. ఏ క్షణంలో అయినా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున ముందుగా ఈ వివరాలు తెలియజేయాలని కోరుతున్నాను. వ్యక్తిగతంగా నేను ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి సమాచారం పొందడం ఆచరణ సాధ్యం కాదు. అందుకే డీజీపీ కార్యాలయం ద్వారా కేసుల విషయంలో సమాచారం ఇవ్వాలి' అని లేఖలో చంద్రబాబు కోరారు. డీజీపీతో పాటు అన్ని జిల్లాల ఎస్పీలు, ఏసీబీ, సీఐడీ విభాగాలకూ వేర్వేరుగా చంద్రబాబు లేఖలు పంపారు. రహస్యంగా ఉంచిన అక్రమ కేసులతో ప్రభుత్వం కుట్రలు చేసే అవకాశం ఉందనే అనుమానంతో ముందుగానే లేఖ రాసి వివరాలు కోరినట్లు వెల్లడించారు. సమాచారం లేని కేసుల విషయంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా డీజీపీకి లేఖ రాసినట్లు చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు.

10న సిద్ధం చివరి సభ

- మేదరమెట్లలో మేనిఫెస్టో విడుదలకు కసరత్తు!
- 'ఐదు వర్గాల కలలే నా కలలు' హోర్డింగులు
- వైసీపీ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ చివరి సిద్ధం సభను ఈనెల 10న బాపట్ల జిల్లా మేదరమెట్లలో నిర్వహించనుంది. మేనిఫెస్టో విడుదలకు అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. మేనిఫెస్టోలో అంశాలు కొలిక్కి వస్తే, అదే వేదికగా సీఎం జగన్ ప్రకటించే అవకాశముంది. దీనిని పురస్కరించుకుని వైసీపీ విభిన్న రీతుల్లో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. ఐదు ప్రధాన అంశాలతో సిద్ధం సభ హోర్డింగులు కనిపిస్తున్నాయి. ఐదు వర్గాల కలలే, తన కలలుగా జగన్ చెబుతున్నట్లు పెద్దఎత్తున హోర్డింగులు వెలిశాయి. యువత కల... నాకల, అలాగే అక్క చెల్లెమ్మలు, అవ్వా తాతలు, రైతుల కల... నా కల అనే అంశాలతో సిద్ధం సభకు వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే మూడు సిద్ధం సభలను నిర్వహించారు. తొలి సభను ఉత్తరాంధ్రంలోని భీమిలిలో ఏర్పాటు చేశారు. రెండో సభను ఏలూరు జిల్లా దెందులూరు, మూడో సభను అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపుపై పార్టీ శ్రేణులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరి కేంద్రంగా 2,700 మంది వైసీపీ కేడర్‌తో కీలక సమావేశాన్ని సీఎం నిర్వహించారు. దీనికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి బూత్ లెవెల్ స్థాయి పార్టీ శ్రేణులు హాజరయ్యారు. అన్ని కార్యక్రమాలు విజయవంతం కావడంతో, ఇక చివరి సిద్ధం సభపై వైసీపీ అధిష్ఠానం ప్రధాన దృష్టి పెట్టింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసీపీ మేనిఫెస్టో అంశంపై సీనియర్ ఐఏఎస్ అధికారులతో చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టోలో కొత్త అంశాలను చేర్చితే అందుకు అయ్యే ఆర్థిక భారం తదితర అంశాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈనెల 10న మేదరమెట్లలో జరిగే సిద్ధం సభా వేదికగా జగన్ ముఖ్యమైన అంశాలతో మేనిఫెస్టో విడుదల చేస్తారన్న ప్రచారముంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వైసీపీ ప్రచారం చేస్తోంది. ఈ సభకు 15 లక్షల మంది పార్టీ శ్రేణులు తరలి వచ్చేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు అంశాలపై నూతన మేనిఫెస్టోను వెల్లడించే అవకాశముంది. సిద్ధం సభ తర్వాత అక్కడక్కడా జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల ఇన్‌చార్జిలపై సీఎం కసరత్తు చేస్తారు. ఇప్పటికే 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకుగాను 90 శాతానికి పైగా అభ్యర్థుల జాబితా దాదాపు కొలిక్కి వచ్చింది. ఈ జాబితా విడుదలైన అనంతరం సీఎం పూర్తి స్థాయిలోఎన్నికల ప్రచారంపై దృష్టి పెట్టనున్నారు.

దేశంలోనే తొలి 'అండర్ వాటర్ మెట్రో'

కోల్‌కతాలో నేడు ప్రారంభం

కోల్‌కతా: నదీగర్భంలో నడిచే మెట్రో రైలు ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశంలోనే మొట్టమొదటి సారిగా కోల్‌కతాలో తొలి 'అండర్‌వాటర్ మెట్రో టన్నెల్‌'ను నిర్మించారు. కాగా ఈ నెల 6న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించనున్నారు. కోల్‌కతా ఈస్ట్, వెస్ట్ మెట్రో కారిడార్ కింద హుగ్లీ నది దిగువన మొత్తం 16.6 కి.మీల మేర ఈ సొరంగ మార్గాన్ని నిర్మించారు. దాదాపు రూ.120 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అండర్‌వాటర్ మెట్రో టన్నెల్... హౌవ్‌డా మైదాన్ నుంచి ఎస్ప్లనాడె స్టేషన్ మధ్యలో ఉంది. 520 మీటర్ల పొడవు ఉన్న ఈ టన్నెల్‌ను 45 సెకన్లలో దాటే మెట్రో రైలు కోల్‌కతాకు వెళ్లే ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. సొరంగ అంతర్గత వ్యాసం 5.5 మీటర్లు కాగా... బాహ్య వ్యాసం 6.1 మీటర్లు. ఈ సొరంగ మార్గాన్ని నదీగర్భానికి 16 మీటర్ల దిగువన, భూమిలోపలికి 32 మీటర్ల లోతులో నిర్మించారు. కోల్‌కతా ఈస్ట్, వెస్ట్ కారిడార్‌కు ఈ టన్నెల్ నిర్మాణం అత్యంత కీలకమని అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం హౌవ్‌డా నుంచి సీల్దాకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే గరిష్ఠంగా 90 నిమిషాల సమయం పడుతుంది. ఇక ఈ అండర్‌వాటర్ మెట్రో మార్గం ఏర్పాటుతో ప్రయాణ సమయం 40 నిమిషాలకు తగ్గనుంది. ఈ కారిడార్ల పరిధిలో ఎస్ప్లనాడె, మహాకారణ్, హౌవ్ డా, హౌవ్ డా మైదాన్ వంటి ముఖ్యమైన స్టేషన్‌లు ఉన్నాయి.

యువత జై శ్రీరాం అంటూ

ఆకలితో చావాలా?

మోదీపై రాహుల్ గాంధీ మండిపాటు

షాజాపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓ వైపు దేశంలో నిరుద్యోగం, ఉపాధి లేక ఆకలి చావులు పెరిగిపోతుంటే... మరోవైపు ప్రధాని మోదీ మాత్రం 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేయాలని చెబుతున్నారని మండిపడ్డారు. ప్రజలతో 'జై శ్రీరాం' అని చెప్పిపిస్తూ... వారు ఆకలితో చనిపోవాలని ప్రధాని కోరుకుంటున్నారని నిశితంగా విమర్శించారు.

మంగళవారం మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్‌లో భారత్ జోడో న్యాయ యాత్ర యాత్రలో భాగంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. న్యాయ యాత్ర షాజాపూర్ మీదుగా సాగుతుండగా స్థానిక కార్పొరేటర్ ముకేశ్ దూబే నేతృత్వంలోని బీజేపీ కార్యకర్తలు 'మోదీ, మోదీ, జై శ్రీరాం' అని నినదిస్తూ... వ్యంగ్యంగా రాహుల్‌కు ఆహ్వానం పలికారు. బీజేపీ శ్రేణుల చర్యపై స్పందించిన రాహుల్... కాసేపు యాత్రను ఆపేసి వారితో మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని, ఉద్యోగాలు లేక యువత సోషల్ మీడియాలో రోజంతా రీల్స్ చూస్తూ గడుపుతున్నారని అన్నారు. 'మీరు రోజంతా ఫోన్‌లు చూస్తూ... జై శ్రీరామ్ అని నినాదాలు చేసి, ఆకలితో చనిపోవాలని ప్రధాని కోరుకుంటున్నారు' అని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ అగ్నివీర్ పథకంపై రాహుల్ మాట్లాడుతూ.. గతంలో సాయుధ దళాలు యువతకు రెండు హామీలు ఇచ్చాయని, యువతకు పెన్షన్ ఇవ్వడంతోపాటు వారు మరణిస్తే సరైన గౌరవం పొందుతారని చెప్పినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం అగ్నివీర్ పథకం కింద నలుగురిని తీసుకొని ముగ్గురిని వదిలేస్తారని... ఆ ముగ్గురిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలే ఉంటారని విమర్శించారు. పాకిస్తాన్‌తో పోలిస్తే భారతదేశంలో నిరుద్యోగం రెట్టింపుగా ఉందని రాహుల్ అన్నారు. ఆదివారం గ్వాలియర్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ నేత మాట్లాడుతూ... భారత్‌లో నిరుద్యోగం 23 శాతంగా ఉంటే పాక్‌లో 12 శాతం ఉందన్నారు. బంగ్లాదేశ్, భూటాన్‌ల కంటే దేశంలో నిరుద్యోగ యువత సంఖ్య ఎక్కువగా ఉందని, భారతదేశ నిరుద్యోగిత రేటు గత 40 ఏళ్లలో ఇదే అత్యధికమని ఆయన పేర్కొన్నారు.

14న మహా పంచాయతీలో పాల్గొంటాం

వ్యవసాయ కార్మిక సంఘాలు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని రామ్ లీలామైదానంలో మార్చి 14న జరిగే కిసాన్ మజ్దూర్ మహా పంచాయతీలో పాల్గొనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రకటించాయి. గ్రామీణ పేదలకు జీవనోపాధినందించే ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని గుల్జార్ సింగ్ గోరియా (బీకేఎంయూ), బి.వెంకట్ (ఏఐఏడబ్ల్యూయూ), అసిత్ గంగూలీ (ఏఐఎస్‌కేఎస్), ధీరేందర్ ఝా (ఏఐఏఆర్ఎల్ఏ), ధర్మేందర్ (ఏఐఏకేఎస్‌యూ) సంయుక్త ప్రకటనలో విమర్శించారు. బీజేపీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికుల పోరాటాన్ని ఉధృతం చేసేందుకు దిల్లీలో జరిగే కిసాన్ మజ్దూర్ మహా పంచాయతీలో వ్యవసాయ, గ్రామీణ కార్మికులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. చారిత్రాత్మక రైతు ఉద్యమం ముగింపు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతులు, వ్యవసాయ కార్మికులు పోరాడుతున్నారని పేర్కొ న్నారు. వీరి పోరాటానికి తలొగ్గి మోదీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని బడా కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేందుకు తీసుకొచ్చిన రైతు, ప్రజా వ్యతిరేక వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని తెలిపారు. కానీ కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) డిమాండ్ అమలు కాలేదని ఆ ప్రకటనలో వారు ఆందోళన వ్యక్తం చేశారు.

మహాయుతిలో సీట్లలొల్లి

- అధిక స్థానాలకు మిత్రపక్షాలు పట్టు
- ఒత్తిడిలో కాషాయ పార్టీ

ముంబై: లోక్‌సభ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో మహారాష్ట్రలో పాలక కూటమి మహాయుతిలో సీట్ల సర్దుబాటు బీజేపీకి తలనొప్పిగా పరిణమించింది. భాగస్వామ్య పార్టీలు అధిక సీట్లకు పట్టుబట్టడంతో కాషాయ పార్టీపై ఒత్తిడి పెరుగుతోంది. ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం), శివసేన (ఏక్‌నాథ్ షిండే వర్గం) ఎక్కువ సీట్లు కావాలని పట్టుబడుతున్నాయి. దీనితో భాగస్వాములకు నచ్చచెప్పేందుకు కమలదళం పడరానిపాట్లు పడుతోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం రాష్ట్ర పర్యటనకు వస్తున్న రోజే మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ దాదాపు 16 లోక్‌సభ స్థానాలపై సమీక్ష నిర్వహించడం ఉత్కంఠ రేపుతోంది. అజిత్ పవార్ వర్గం ప్రస్తుతం ఒకే ఒక లోక్‌సభ స్థానం కలిగిఉంది. పార్టీ రాష్ట్ర శాఖ చీఫ్ సునీల్ తత్కరే రయ్‌ఘడ్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మహారాష్ట్రలోని మొత్తం 48 లోక్‌సభ స్థానాలలో అజిత్ పవార్ వర్గం కనీసం 10 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. ధారాసివ్, పర్భని, బుల్దానా, మాల్డా, గడ్చిరోలి, హింగోలి, బారామతి, షిరూర్, సతారా, రాయ్‌గఢ్ స్థానాల్లో పోటీ చేయాలని ఆ పార్టీ కసరత్తు చేస్తోంది. షిండే శిబిరంలో మంత్రిగా పనిచేస్తున్న శంభురాజ్ దేశాయ్ మాట్లాడుతూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ 22 స్థానాల్లో పోటీ చేయనుందని చెప్పారు. మాల్డా, రత్నగిరి, సింధుదుర్గ, మావల్, షిరూర్, రాయ్‌గఢ్, ముంబై నార్త్‌వెస్ట్, పాల్ఘర్, శంభాజీ నగర్, పర్భని, యావత్మాల్, షిర్డి, గడ్చిరోలి స్థానాల కోసం బీజేపీ, శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంది.

ఎన్నికల్లో హింసను సహించం

సీఈసీ రాజీవ్ కుమార్

న్యూదిల్లీ: ఎన్నికల్లో హింసను సహించేది లేదని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం ఆయన పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హింసను నిరోధించేందుకు ఎన్నికల సంఘం సీ విజిల్ పేరుతో అప్లికేషన్ ప్రారంభించబోతుందన్నారు. సీ-విజిల్ అంటే సివిలియన్ టూ విజిలెంట్ అని అర్థమన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, హింస రహితంగా ఎన్నికలను నిర్వహించడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని రాజీవ్ కుమార్ అన్నారు. ఎన్నికల్లో భయాందోళనలకు, బెదిరింపులకు తావు లేదని, అధికారుల పక్షపాత వైఖరిని సహించబోమన్నారు. బెంగాల్‌లో తగిన సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన సీ విజిల్ అప్లికేషన్ ఫీచర్స్ వివరాలను వివరించారు. ఎన్నికలకు అక్రమాలకు, హింసకు సిద్ధమైతే, వినియోగదారులు ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు చేస్తారన్నారు. 100 నిమిషాల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏ అభ్యర్థికైనా క్రిమినల్ నేపథ్యం ఉంటే ఈ యాప్ ద్వారా అభ్యర్థిని గుర్తించవచ్చని రాజీవ్ కుమార్ తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా తమ వెబ్‌సైట్లతో పాటు పత్రికల ద్వారా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలలో కొన్ని పోలింగ్ కేంద్రాలను కేవలం మహిళలు మాత్రమే నిర్వహించనున్నారనీ, ఆ ఎన్నికల కేంద్రాల వద్ద మహిళా భద్రతా బలగాలను మోహరిస్తారన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాలు పూర్తిగా దివ్యాంగులతో నిర్వహించనున్నట్లు చెప్పారు. తాము ఎవరికీ తక్కువ కాదని నిరూపించేందుకు వారు ఉదాహరణగా నిలుస్తారన్నారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోండి

ఇజ్రాయిల్ సరిహద్దులోని భారతీయులకు కేంద్రం సూచనలు

న్యూదిల్లీ: లెబనాన్‌లో హెజ్బుల్లా జరిపిన రాకెట్ దాడిలో ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఉత్తర ఇజ్రాయిల్‌లో లెబనాన్ సరిహద్దు వెంబడి మార్గాలియట్ తోటలో ఈ ఘటన జరిగింది. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన వెలువరించింది. గాయపడిన వారిలో థాయిలాండ్ పౌరులు కూడా ఉన్నట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ తెలిపింది. తాజా పరిణామంతో భారత ప్రభుత్వం తమ పౌరులకు హెచ్చరికలు చేసింది. ఆ దేశ సరిహద్దుల వెంబడి ఉంటే భారతీయులంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఇజ్రాయిల్ సరిహద్దు ప్రాంతాల్లో పనిచేసే భారతీయులు, భారత పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని, స్థానిక అధికారులు జారీ చేసే హెచ్చరికలను అనుసరించాలని సూచనలు చేసింది. భారతీయుల పౌరుల భద్రత కోసం ఇజ్రాయిల్ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రకటన వెల్లడించింది. ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరు క్రమంలో నెలకొన్న మానవతా సంక్షోభం కలచివేస్తోందని పేర్కొంది. ఇదిలావుంటే ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరులో ఓ భారతీయుడు చనిపోవడం ఇదే తొలిసారి. అతనిని కేరళ, కొల్లామ్‌కు చెందిన పట్నిబిన్ మాక్స్‌వెల్‌గా గుర్తించారు. గాయపడిన వారిని ఇడుక్కికి చెందిన జోసెఫ్ జార్జ్, పాల్ మెల్విన్‌గా గుర్తించారు. వీరు పొలంలో పనిచేస్తున్న సమయంలో క్షిపణి దాడి జరిగింది. మ్యాక్స్‌వెల్ రెండు నెలల కిందటే ఇజ్రాయిల్ వెళ్లారు. ఆయన భార్య ఏడు నెలల గర్భిణి. వీరికి ఐదేళ్ల కుమార్తె ఉంది. మ్యాక్స్‌వెల్ మరణ వార్త అర్ధరాత్రి సమయంలో తమకు తెలిసిందని ఆయన కుటుంబం తెలిపింది. మరో నాలుగు రోజుల్లో ఆయన భౌతికకాయం భారత్‌కు చేరుతుందని సమాచారం. మరోవైపు బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ భారత్‌లోని ఇజ్రాయిల్ దౌత్యకార్యాలయం ఓ ప్రకటన చేసింది. గాయపడిన వారికి తమ వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నట్లు తెలిపింది. ఉగ్రవాదం వల్ల ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారు ఇజ్రాయిలీలా లేక ఇతర దేశానికి చెందిన వారైనాగానీ వివక్ష చూపబోమని పేర్కొంది. బాధిత కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించింది.

యూపీఎస్సీ సర్వర్ డౌన్

ఆందోళనలో సివిల్ అభ్యర్థులు

న్యూదిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సర్వర్ డౌన్ అయింది. దీంతో మార్చి 6వ తేదీ (బుధవారం) సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించారు. 5వ తేదీ చివరిరోజు కావడంతో ఉదయం నుంచే అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు యూపీఎస్సీ వెబ్‌సైట్‌ను లాగిన్ చేశారు. అయితే మధ్యాహ్నం నుంచి సర్వర్ డౌన్ అయింది. దీంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. సర్వర్ డౌన్ కావడంతో చాలా మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి, మరో రెండు రోజులు గడువు పొడిగించాలని కోరారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.